


మోసాలు, అబద్ధాలే జగన్ రాజకీయాలకు ఆధారం. రాష్ట్ర అభివృద్ధిపై ఆయనకు ఆసక్తి లేదు. ప్రజా సమస్యలపై చర్చకు పిలిచినా ముందుకు రాలేదు. నాలుగు గోడల మధ్య నుంచి సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వీకెండ్ రాజకీయాలతో కాలం గడుపుతున్నారు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



శుక్రవారం 13.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 325 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# నేడు అన్నదాత సుఖీభవ 3.0 సాయం

- కర్షకులకు కూటమి ప్రభుత్వ ఉగాది కానుక
- 46.85 లక్షల మందికి రూ.6 వేల చొప్పున జమ చేయనున్న ప్రభుత్వం
- కృష్ణాజిల్లా, సూరంపల్లి కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం రైతన్నలకు 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ చేయనుంది. 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ 3.0'లో భాగంగా రైతులకు శుక్రవారం ఆర్థిక సాయాన్ని విడుదల చేయనుంది. మూడవ విడతగా 46.85 లక్షల మందికి కేంద్ర, రాష్ట్ర వాటా కలిపి ఒక్కో రైతు అకౌంట్‌లో రూ.6,000 జమ చేయనుంది. మూడో విడతగా రూ.2,676 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర వాటా రూ.1,874 కోట్లు. ఇప్పటికే రెండు విడతల కలిపి రూ.14 వేలను ప్రభుత్వం అందించింది. శుక్రవారం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రైతులకు ఇచ్చిన హామీ ఏడాదికి రూ.20 వేల సాయం పూర్తవుతుంది.

**ఏడాదిలో రూ.8,985 కోట్ల సాయం :** ఒక్కో రైతు కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని కూటమి సూపర్ –6లో పేర్కొంది. కేంద్రం పీఎం కిసాన్ కింద రూ.6,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 కలిపి మూడు విడతల్లో ప్రతీ రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2025 ఆగస్ట్ 2న మొదటి విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,174 కోట్లు, నవంబర్ 19న రెండవ విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,135 కోట్లు కలిపి రూ.6,309 కోట్లు రైతులకు అందించింది. రేపు మూడో విడతలో రూ.6 వేల చొప్పున 46.85 లక్షల మందికి రూ.2,676కోట్లు ఇవ్వనుంది. ఒక్కఏడాదిలోనే రైతు సోదరులకు కూటమి ప్రభుత్వం రూ.8,985 కోట్లు అందించినట్లు అవుతుంది. ఇందులో రాష్ట్ర వాటా రూ.6,560 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.2,425 కోట్లు.

**సూరంపల్లి నుంచి నిధులు విడుదల చేయనున్న సీఎం :** అన్నదాత సుఖీభవ 3.0 నిధులు విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. కృష్ణాజిల్లా, గన్నవరం నియోజకవర్గం, సూరంపల్లిలో శుక్రవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.20 గంటలకు సీఎం సూరంపల్లికి చేరుకుంటారు. 4.25 గంటల నుంచి 4.55 గంటల వరకు రైతు సోదరులతో ముఖాముఖి అవుతారు. 05.00 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు.

## యూనివర్సిటీ టవున్‌షిప్స్ తీసుకొస్తాం




- యూనివర్సిటీలన్నిటికి కలిపి ఒకే యాక్ట్ రూపొందించే ప్రయత్నం
- ఉన్నత విద్యను మెరుగుపరిచేలా చర్యలు
- పాఠశాల విద్యలో విప్లవాత్మకం చర్యలు
- విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్

మిగతా 2లో...

## ఏపీలో పనులు చేస్తూ...

## వేరే రాష్ట్రాల్లో పన్నులు కడతామంటే ఎలా?

- ప్రజా ప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ లేఖలు
- పెట్టుబడుల గురించి ఆలోచించినట్టే... పేదల గురించీ ఆలోచించాలి
- వేధింపులు లేకుండా పన్నుల వసూళ్లు పెరగాలి
- విద్యార్థులకు గుర్తుండిపోయేలా యూనివర్శిటీల్లో స్నాతకోత్సవాలు
- 6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తోందని... ఆ పథకాలకు సంబంధించిన ఓనర్షిప్ తీసుకోవాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధుల మీద ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు వివిధ పథకాల లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజున సూపర్ సిక్స్, సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై సీఎం సమీక్షించారు. మిగతా 2లో...

### అమరావతిలో క్రియేటీవ్ సిటీ, హిందూపూర్‌లో ఎలక్ట్రానిక్ సిటీ ఏర్పాటు

● జిల్లాలను ప్రమోట్ చేయండి... పెట్టుబడులను ఆకర్షించండి ● స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కలెక్టర్లకు ర్యాంకింగులిస్తాం ● కమిట్మెంట్... కన్విన్స్... కో-ఆపరేట్ ● పెట్టుబడులను రాబట్టేందుకు కలెక్టర్లకు 3C ఫార్ములను నిర్దేశించిన ముఖ్యమంత్రి ● 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో పెట్టుబడులు, టూరిజం శాఖలపై సీఎం సమీక్ష

2 లో

## 'అరకు కౌని' పేరుతో గిరిజన మిల్లెట్ ఫుడ్ మెనూ

- గిరిజన మిల్లెట్ ఫుడ్ మెనూను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు
- 'అరకు కౌని' పేరుతో సాంప్రదాయ గిరిజన వంటకాలతో మిల్లెట్ మీల్ తయారీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'అరకు కౌని' పేరుతో రూపొందించిన తొలి గిరిజన ఆర్గానిక్ మిల్లెట్ ఫుడ్ మెనూను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం 6వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజున ఏర్పాటు చేసిన ఈ ఆర్గానిక్ మిల్లెట్ ఆహార ఉత్పత్తుల స్టాల్‌ను సీఎం చంద్రబాబు సందర్శించారు. మిగతా 2లో...

## కాఫీ సాగులో దేశంలో రెండో స్థానం లక్ష్యంగా ఏపీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల కార్యక్రమాలపై కార్యదర్శి ఎంఎం నాయక్ ప్రెజెంటేషన్ ఇస్తూ.. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఏపీ స్టడీ సర్కిల్ ద్వారా పేద విద్యార్థులకు అత్యుత్తమ కోచింగ్ ఇస్తున్నామని,యూపీఎస్సీ ప్రిలిమ్స్ కోసం 140 మందికి, ఐబీపీఎస్/ఎస్ఎస్సీ పరీక్షల కోసం మరో 140 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం కేంద్రాల్లో మిగతా 2లో...

## మే 31 నాటికి హాస్టళ్లన్నింటిలో మరుగుదొడ్లు పూర్తి



- బాలికల భద్రతకు 368 హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ సంక్షేమ శాఖ సమీక్షలో ఆశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి సత్యనారాయణ ప్రెజెంటేషన్ ఇస్తూ...బీసీ సంక్షేమ శాఖ హాస్టళ్ల పనితీరు,పదో తరగతి పరీక్షల సన్నద్ధతపై మాట్లాడుతూ మిగతా 2లో...

## 125 రోజులకు పనిదినాల పెంపు

## సోలార్, జల్ జీవన్ నిర్వహణతో సహా కొత్త పనులకు అనుమతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధి హామీ, 'వీబీ–గ్రామ్ జీ' పథకం పై రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య శశి భూషణ్ కుమార్ ప్రెజెంటేషన్ ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ముఖ్యంగా ఉపాధి హామీ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురాబోతున్న 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవిక మిషన్ – గ్రామీణ్' పథకం విధివిధానాలను ఆయన కలెక్టర్లకు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) లో ఇప్పటివరకు 17.74 కోట్ల పనిదినాలు కల్పించామని, మిగతా 2లో...

## ఏ పట్టణంలోనూ నీటి ఎద్దడి రానివ్వొద్దు

## 39 క్రిటికల్ పట్టణాలకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణాల్లో వేసవి తాగునీటి ప్రణాళికపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ప్రెజెంటేషన్ ఇస్తూ వేసవిలో పట్టణ ప్రజలకు నీటి కొరత కూడా రాకుండా మున్సిపల్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు/కార్పొరేషన్లలో సగటున మనిషికి 135 లీటర్ల చొప్పున లెక్కేస్తే.. మొత్తం డిమాండ్ 2680 ఎంఎల్ డీ కాగా, ప్రస్తుతం 2098 ఎంఎల్ డీలు సరఫరా చేస్తున్నామని, సుమారు 582 ఎంఎల్ డీల కొరత ఉందని తెలిపారు. ప్రస్తుతం 19 పట్టణాల్లో 135 లీటర్లకు పైగా సరఫరా జరుగుతోందని, 33 పట్టణాల్లో 70 లీటర్ల కన్నా తక్కువ

## విశాఖలో రూ.100 కోట్లతో

## భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్



- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ముంబయిలో అవగాహన ఒప్పందం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మరో కీలక అడుగు వేసింది. విశాఖపట్నంలో అత్యాధునిక అమ్యూజ్‌మెంట్ పార్క్ మరియు రిసార్ట్ అభివృద్ధి కోసం మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్‌తో మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ముంబయిలో జరిగిన IAAPI (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్) ఎక్స్‌పో–2026 వేదికగా పర్యాటక శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'లో భాగంగా, వినోద రంగాన్ని రాష్ట్ర పర్యాటక వృద్ధికి ప్రధాన చిహ్నంగా మలిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మిగతా 3లో...

- జైశంకర్ దౌత్యంతో చమురు నౌకలకు ఇరాన్ గ్రీన్ సిగ్నల్
- బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్



## చమురు నౌకలకు అనుమతి...

## భారత దౌత్య విజయమే

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** భారత జాతీయ జెండా కలిగిన చమురు నౌకలను జలసంధి ప్రాంతంలో అడ్డుకోవద్దని ఇరాన్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కేంద్ర విదేశాంగ శాఖ దౌత్య విజయానికి నిదర్శనమని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ ఎస్. జైశంకర్ చేసిన దౌత్యపరమైన కృషి ఫలితంగానే ఈ సానుకూల నిర్ణయం సాధ్యమైందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠను పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన దౌత్యాన్ని కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

భారత జాతీయ జెండా ఉన్న నౌకలు జలసంధి ప్రాంతంలో సురక్షితంగా ప్రయాణించేందుకు అనుమతిస్తారని విదేశాంగ మంత్రి వెల్లడించిన విషయం ఆనందదాయకమని మాధవ్ అన్నారు. మిగతా 2లో...

## 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో...

## ఏపీ జెన్కో చారిత్రాత్మక రికార్డు



- సీఎం చంద్రబాబు సలహాలు, జెన్కో సిబ్బంది కృషితోనే రికార్డు ఉత్పత్తి
- గృహ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు నిరంతరాయ విద్యుత్తే లక్ష్యం
- వేసవి విద్యుత్ అవసరాలు తీర్చేందుకు సిద్ధంగా ఉండాలి
- జెన్కో రికార్డు సాధనకు కృషి చేసిన అందరికీ అభినందనలు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర విద్యుత్ చరిత్రలో మొదటి సారి ఏపీ జెన్కో 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో లైఫ్‌టైం రికార్డు సాధించడం గొప్ప విషయమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (జెన్కో)ను స్థాపించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు ఎప్పుడూ నమోదు కాని విధంగా 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 5730 మెగావాట్ల ఎక్స్–బస్ ఉత్పత్తి సాధించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో ఇచ్చిన సలహాలు, సూచనలతో పాటు జెన్కో సిబ్బంది ప్రత్యేక కృషి ప్రధాన కారణమని మంత్రి పేర్కొన్నారు. జెన్కో సాధించిన అసాధారణ విజయం సందర్భంగా జెన్కో అధికారులతో గురువారం నాడు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయం నుంచే వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జెన్కో అధికారులను అభినందించారు. గృహ, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. జెన్కో సాధించిన రికార్డు ఉత్పత్తిలో పాలుపంచుకున్నసిబ్బంది అందరికీ మంత్రి గొట్టిపాటి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మిగతా 3లో...

### చమురు నౌకలకు అనుమతి...

## భారత దౌత్య విజయమే



(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం భారత నౌకాయాన రంగానికి ఊరటనిస్తుందని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక-రాజకీయ పరిస్థితుల మధ్య దేశ ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ దౌత్య విజయంతో భారత నౌకాయాన రంగానికి భద్రతతో పాటు దేశ ఆర్థిక ప్రయోజనాలు కూడా రక్షించబడతాయని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై భారత గౌరవాన్ని మరింత బలంగా నిలబెట్టేలా చర్యలు తీసుకుంటోందని మాధవ్ పేర్కొన్నారు.

## మే 31 నాటికి హాస్టళ్లన్నింటిలో మరుగుదొడ్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా బీసీ హాస్టళ్లలో 8,068 మంది, ఎంజేపీ స్కూళ్లలో 5,536 మంది కలిపి మొత్తం 13,604 మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు. వీరిలో చదువులో కాస్త వెనుకబడిన 2,146 మంది విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి, వారు మంచి మార్కులు సాధించేలా అనకాపల్లి జిల్లా మోడల్ లో కచ్చితమైన స్టడీ అవర్స్ నిర్వహించాలని కోరారు. హాస్టళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా.. ఎస్బీఎం కింద మంజూరైన 907 మరుగుదొడ్ల నిర్మాణాల్లో 237 పూర్తయ్యాయని, మిగిలిన 608 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణాలు మే 31 నాటికి వంద శాతం పూర్తి కావాలని ఇది హైకోర్టుకు ఇచ్చిన హామీ అని గుర్తుచేశారు. మరుగుదొడ్ల నిర్మాణంలో కర్నూలు, శ్రీకాకుళం, మన్యం, విశాఖపట్నం జిల్లాలు ముందున్నాయని పేర్కొన్నారు.

అలాగే 8 ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో రూ. 56.67 కోట్లతో మౌలిక వసతుల పనులు చేపట్టామని, 772 బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్ల పనులు ప్రారంభించామని వెల్లడించారు. దోమల బెడద లేకుండా అన్ని హాస్టళ్లలో మెష్ ల ఏర్పాటు పనులు కూడా జరుగుతున్నాయన్నారు.

విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ.. రాష్ట్రంలోని 368 బీసీ బాలికల హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం 20 చోట్ల మాత్రమే కెమెరాలు ఉన్నాయని, మిగిలిన వాటిలో సీఎస్ఆర్ నిధులు లేదా ఇతర దాతల సాయంతో వెంటనే సీసీ కెమెరాలు బిగించేలా కలెక్టర్లు చొరవ చూపాలని ఆయన సూచించారు. అలాగే హెచ్ పీటీఎస్ యాప్ ద్వారా విద్యార్థులకు పెడుతున్న మెనూ, పరిశుభ్రతకు సంబంధించిన లైవ్ ఫోటోలను అప్లోడ్ చేయాలని సూచించారు.

## 'అరకు కౌని' పేరుతో గిరిజన మిల్లెట్ ఫుడ్ మెనూ



(మొదటి పేజీ తరువాయి)

గిరిజనులు పండించిన కొర్రలు, రాగులు, సామలు, కాకిజొన్నలు, గంట్ల, మొక్కజొన్న, కొండ కందులు, రాజ్మాతో చేసిన కొర్ర పాయసం, రాగి చపాతీ, సామల పులిహోర, కాంట్ల అంబలి, కార్న్ వడ, తూర్ దాల్ కర్రీ వంటి ఆహార ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించారు. ఈ ఆహార ఉత్పత్తులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించి రుచి చూశారు. గిరిజనుల ఆహార సంప్రదాయాలను గౌరవిస్తూ ఆరోగ్యకరమైన మిల్లెట్ ఆహారాన్ని మరింత ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. టూరిజం, ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ కలిసి రాష్ట్రంలోని స్టార్ హోటళ్లు, ఆతిథ్య సంస్థలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నాయని సీఎంకు అధికారులు తెలిపారు. ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో 'అరకు కౌని' వంటకాలను వారి మెనూలో చేర్చడం ద్వారా గిరిజన మిల్లెట్ మీల్స్‌ను ప్రోత్సాహించాలన్నారు. మిల్లెట్ థాళీని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు...జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

## కాఫీ సాగులో దేశంలో రెండో స్థానం లక్ష్యంగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సీయూఈటీ కోసం ఏకంగా 1,059 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారికోసం 8 ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌ల కోసం రూ. 90 లక్షలు ఖర్చు చేశామని వివరించారు. పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల్లో ఒత్తిడిని జయించేందుకు 'హార్ట్ ఫుల్ నెస్' ఫౌండేషన్ ద్వారా 3 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించామని చెప్పారు.

విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు గమనించేందుకు జేఎన్బీ పోర్టల్ ద్వారా 'డిజిటల్ హెల్త్ మాడ్యూల్' డెవలప్ చేశామని, యాప్ ద్వారా రియల్ టైమ్ లో డేటా నమోదు చేస్తున్నామని చెప్పారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి.. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కింద మంజూరైన పనులన్నింటినీ వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు.

ఇక గిరిజన సంక్షేమానికి సంబంధించి.. రాష్ట్రంలో కాఫీ తోటల పెంపకాన్ని భారీగా ప్రోత్సహిస్తున్నామని, ప్రస్తుతం 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోందని వెల్లడించారు. రాబోయే 2026-27 నాటికి మరో 10 వేల ఎకరాలకు విస్తరించడంతో పాటు, 15 వేల ఎకరాల్లో తోటల పునరుద్ధరణ చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోనే కాఫీ ఉత్పత్తిలో ఏపీ రెండో స్థానానికి చేరుకుంటుందని సంతోషం వ్యక్తం చేశారు.

గిరిజనుల ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచేందుకు అమలు చేస్తున్న ఇతర పథకాల గణాంకాలను కూడా ఆయన వివరించారు. రూ. 7.93 కోట్లతో పసుపు సాగు ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, దీని ద్వారా ఎకరాకు సగటున రూ. 1,12,000 ఆదాయం వస్తోందని చెప్పారు. అలాగే రూ. 7 కోట్లతో 4,593 గిరిజన కుటుంబాలకు దేశవాళీ కోళ్ల పెంపకం పథకం అందిస్తున్నామన్నారు.

ట్రైకార్-ఉన్నతి కింద రూ. 40 కోట్ల 30 లక్షలతో 4,030 మంది ఎస్టీ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు. నైపుణ్యాభివృద్ధి కింద కంప్యూటర్, ఎలక్ట్రీషియన్ తదితర కోర్సుల్లో వివిధ ఐటీడీఏల పరిధిలో 8,940 మంది గిరిజన యువతకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

## ఏపీలో పనులు చేస్తూ... వేరే రాష్ట్రాల్లో పన్నులు కడతామంటే ఎలా?

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..." సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వం తరపున లేఖను అందించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతీ లబ్దిదారుకూ ప్రతీ నెలా ఏం లబ్ది కలిగిందో తెలిసేలా చేయాలి. ఏ కుటుంబానికి ఏం లబ్ది కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుంది. ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలెండర్, తల్లికి వందనం, ఫీజు రీయింబర్సుమెంట్ లాంటివి లబ్దిదారులకు తెలియాలి. పథకం అమలు చేసే ముందు... లబ్దిదారుని ఖాతాలో డబ్బులు జమ చేసే ముందు ప్రతి లబ్దిదారు కుటుంబానికి సంక్షేమ లేఖలు అందేలా చూడాలి. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలి. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్దిదారులకు ఇస్తే వారు వినియోగించుకుంటారు. మార్చి 9 నాటికి 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారు. రూ.1775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్సు చేసింది. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవల్ని వినియోగించుకుని పీ4 సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా చేపట్టాలి. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలి. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలి. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తాం. అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నాం. అన్నా క్యాంటీన్ల ద్వారా 7.50 కోట్ల భోజనాలు



ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగాం. అంగన్ వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నాం. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాం. పల్లె పండుగ కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.4 వేల కోట్ల వ్యయం చేశాం. సంక్షేమ పథకాలు లాస్ట్ మైల్ డెలివరికి చేరడమనేది లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలి. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పని చేయాలి. ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం లేదా ఇంటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఉగాదికి 2.50 లక్షల మందికి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. ప్రతీ ఇంటికీ జేజేఎం కింద తాగునీటి కుళాయి ఇస్తాం... ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా చర్యలు తీసుకుంటాం. సాలిడ్, లిక్విడ్ మేనేజ్మెంట్ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి. నెట్ జీరో కాన్సెప్టుగా ఘన వ్యర్ధాలను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు తరలించాలి. తడి వ్యర్ధాలను కాంపోస్టు తయారు చేసేందుకు మళ్లించాలి. 500 పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టులో కిచెన్ గార్డెన్, బయోడైవర్సిటీలో భాగస్వాములను చేయాలి. వీ బీజీ రామ్ జీ కింద రూ.9773 కోట్లు ఏపీకి కేటాయించారు. ఇప్పుడు ఈ పథకం డిమాండ్ డ్రివెన్ కాదు... దీనికి అనుగుణంగా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పెట్టుడులు గురించి ఎలా ఆలోచిస్తున్నామో... పేదలకు అందించే సంక్షేమం గురించి... వారికి కల్పించే సాధికారత గురించీ కలెక్టర్లు ఆలోచించాలి"అని సీఎం చంద్రబాబు సూచించారు.

**ప్రతి రంగంలో వృద్ధి సాధించి జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి** : "పన్ను ఎగవేతలు లేకుండా పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి. ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టార్ అభివృద్ధి జరిగితే... ప్రభుత్వానికి పెద్ద ఎత్తున వస్తుంది. ప్రతీ రంగంలోనూ వృద్ధి సాధించటం ద్వారా జీఎస్డీపీ లక్ష్యాన్ని చేరుకోవాలి. కొందరు కాంట్రాక్టర్లు తమ కార్యాలయాలు వేరే రాష్ట్రాల్లో పెట్టుకున్నారు... పనులు మాత్రం మన రాష్ట్రంలో చేస్తున్నారు. టెండర్లు, వర్క్ ఆర్డర్లలోని కాంట్రాక్టర్ల నుంచి ఆదాయం రావటం లేదు. ఇది సరి కాదు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఇతర ప్రాజెక్టుల పనుల్లో కాంట్రాక్టర్లు చెల్లించే పన్నులు మన రాష్ట్రంలో చెల్లించేలా చూడాలి. పన్ను వసూళ్ల విషయంలో అనవసరపు వేధింపులు వద్దు. పన్ను ఎగవేతలు ఉండకూడదు. పన్నుల పరిధిలో ఉన్నవారు తప్పించుకోవడానికి వీల్లేదు... పన్నులు చెల్లించేలా చూడాలి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి పన్ను ఎగవేతకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలి. పాఠ్యాంశాల్లో కాలానుగుణంగా మార్పులు రావాలి. ప్రస్తుత అవసరాలు, అభివృద్ధికి అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలి. చీజజు=ు సహా వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలను, విశ్వవిద్యాలయాలను సంప్రదించి అధ్యయనం చేయాలి. వయోజన విద్యకు సంబంధించి అక్షరాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించటంలో కలెక్టర్లు పూర్తి శ్రద్ధ పెట్టాలి. జాతీయ స్థాయి విద్యా సంస్థలు అనుసరిస్తున్న పాఠ్యాంశాలు... మన విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్న పాఠ్యాంశాలను సమీక్షించాలి. జాతీయ, అంతర్జాతీయ విద్యాబోధన ప్రమాణాల్లో ఎక్కడున్నామనేది అధ్యయనం చేయాలి. తమిళనాడు, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు ఉన్నత విద్యలో అగ్రస్థానంలో ఉన్నాయి. గత పాలనలో టీచర్లను కూడా రిక్రూట్ చేయలేకపోయారు. స్కిల్ డెవలప్మెంట్ ను రీస్ట్రక్చర్ చేసి... ఉద్యోగావకాశాలు లభించేలా చర్యలు చేపట్టాలి. స్నాతకోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి. విదేశాల్లో దీనిని అపురూపమైన ఘట్టంగా నిర్వహిస్తారు. విద్యార్థులకు చిరస్థాయిగా గుర్తుండి పోయేలా విశ్వవిద్యాలయాల్లో కాన్వొకేషన్ ప్రక్రియ జరగాలి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యా సంస్థల రేటింగ్ ఎలా ఉందో పరిశీలించాలి."అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు

## యూనివర్సిటీ టవున్‌షిప్స్ తీసుకొస్తాం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో ప్రపంచ అత్యుత్తమ ప్రమాణాలతో యూనివర్సిటీ టవున్‌షిప్‌లను తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్ తెలిపారు. కలెక్టర్ల సదస్సులో బాగంగా విద్యాశాఖ ప్రగతి గురించి ఆయన వివరించారు. గత 18నెలల కాలంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. 11వేల అంగన్వాడీలను పాఠశాలతో అనుసంధానం చేశామన్నారు. మరో 30వేల పాఠశాలలను కూడా అనుసంధాంన చేయనున్నామని, మండలానికి ఒక పాఠశాలను తీసుకుని ఆ ప్రాంతంలోని అంగన్వాడీని ఎలా అనుసంధానం చేయాలనే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, కలెక్టరలు కూడా ఈ దిశగా సలహాలు ఇవ్వాలని కోరారు. 779 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను అప్ గ్రేడ్ చేశామన్నారు. కమ్యూనిటీ బేస్డ్ స్టూడెంట్ ట్రాకింగ్ సిస్టమ్‌లో బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో ఉండేలా చేస్తున్నామన్నారు. ఇప్పటికే 50వేల మంది విద్యార్థులను మళ్లీ బడిబాట పట్టించామన్నారు. లీప్ యాప్ ద్వారా ఆయా పాఠశాల ప్రాంతంలో ఎంతమంది బడి ఈడు పిల్లలున్నారు, వారి విరాలన్నీ కూడా నిక్షిప్తం



చేశామన్నారు. ఆయ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి వెంటనే దీనికి సంబంధించి అలర్ట్ వెళుతుందని, ఉపాధ్యాయులు ఆ విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి అతడ్ని బడిలో చేర్పించే వీలు కలుగుతుందన్నారు. 598 మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 40 మందికంటే తక్కువ విద్యార్థులున్నారని ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన అవసరముందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు చాలా ముఖ్యమన్నారు. రాష్ట్రంలో 125 ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేయడానికి దాతల సహకారం కూడా తీసుకుంటామని, ఇందుకోసం త్వరలోనే ఒక డోనర్ యాప్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**ఉన్నత విద్యపై ప్రత్యేక దృష్టి** : రాష్ట్రంలో ఉన్నత విద్యను గాడిలో పెట్టడానికి సీఎం, మంత్రి నారా లోకేష్ ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రపంచ అత్యుత్తమ ప్రమాణాలతో యూనివర్సిటీ టవున్‌షిప్‌లను ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు యూనివర్సిటీ చట్టాలు ఏ యూనివర్సిటీకీ ఆయా యూనివర్సిటీ ఒక ప్రత్యేక చట్టం ఉందని అలా కాకుండా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు ఒక ఏకీకృత చట్టం తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని, దీనికి సంబంధించి సలహాలు తీసుకొని తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కళాశాల్లో అధ్యాపకులు, విద్యార్థులకు ముఖ ఆధారిత హాజరు అమలు చేస్తామన్నారు.

## అమరావతిలో క్రియేటీవ్ సిటీ, హిందూపూర్‌లో ఎలక్ట్రానిక్ సిటీ ఏర్పాటు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : పెట్టుబడులు రాబట్టడం ఆయా శాఖలకు సంబంధించిన అంశంగా కాకుండా... జిల్లా కలెక్టర్లు కూడా బాధ్యతగా తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు పెట్టుబడులు రాబట్టుకునేలా సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో పెట్టుబడులను రాబట్టేలా కలెక్టర్లు కమిట్మెంట్‌తో పెట్టుబడిదారులను అన్వేషించి... పెట్టుబడులు పెట్టేందుకు కన్విన్స్ చేసి... ముందుకు వచ్చిన వారికి పూర్తిగా కో-ఆపరేట్ చేయాలంటూ జిల్లా కలెక్టర్లకు 3జ ఫార్ములాను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం రెండో రోజున ముఖ్యమంత్రి వివిధ అంశాలపై సమీక్షించారు. పెట్టుబడి, టూరిజం శాఖలపై జరిగిన చర్చలో సీఎం కీలకాంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులను వేగంగా గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి. పెట్టుబడులను ఆకర్షించేలా జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలి. పెట్టుబడులు వస్తే... స్థానికంగా యువతకు ఉపాధి, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతాయి. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను ఎకనామిక్ రీజియన్ డెవలప్మెంట్ పేరుతో అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ రీజియన్ కు పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, అమరావతికి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్, తిరుపతి రీజియన్ కు ముఖేష్ కుమార్ మీనా బాధ్యత వహిస్తారు. రీజియన్ల వారీగా పరిశ్రమలు, పెట్టుబడులు, ఆయా ప్రాంతాల ఆర్థికాభివృద్ధి బాధ్యతను ఈ అధికారులు తీసుకుంటారు. పెట్టుబడులపై ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షించి ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేందుకు తక్షణం చర్యలు చేపట్టాలి. అనుమతులు వేగంగా ఇవ్వటంతో పాటు భూ కేటాయింపులు కూడా యుద్ధప్రాతిపదికన జరిగేలా చూడాలి. పరిశ్రమలకు నీటిని ఇస్తేనే వేగంగా ఉత్పాదన ప్రారంభిస్తారు. ఓర్వకల్లులో పారిశ్రామిక క్లస్టర్ రూపకల్పన చేశాం. ఇప్పుడు ఎయిర్ పోర్టు లాంటి మౌలిక సదుపాయాలు కూడా వచ్చాయి. ఇప్పుడు భవిష్యత్తులో ఓ మేజర్ పారిశ్రామిక హబ్ గా మారుతుంది. కడప జిల్లాలో కొప్పర్తి కూడా ఆ పారిశ్రామిక క్లస్టర్ గా తయారు కావాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.



**పెట్టుబడులపై జిల్లాల్లోనూ సమావేశాలు పెట్టాలి** : "పెట్టుబడులపై జిల్లాల్లో కూడా సమావేశాలు నిర్వహించాలి. పెట్టుబడులు రాబట్టేందుకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంపై జిల్లాల వారీగా ర్యాంకులిస్తాం. 2019-24లో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. అమర్ రాజా కంపెనీ తిరుపతిలో కార్పోరేట్ ఆఫీస్ పెట్టింది... వారినీ గత పాలకులు పారిపోయేలా చేశారు. 2014-19లో పరిశ్రమలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం వేరే అవసరాలకు వాడేసింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీని బెంగళూరుకు పోటీగా తీర్చిదిద్దాం. మోస్ట్ లివబుల్ సిటీగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాం... ఎకో సిస్టం కల్పించాం. ఇప్పుడు ఆ ఫలితాలు హైదరాబాద్ అనుభవిస్తోంది. ఇప్పుడు రాష్ట్రం మొత్తం అదే తరహా ఎకో సిస్టం ఏర్పాటు చేస్తున్నాం. ఏదైనా జిల్లాల్లో పరిశ్రమలు రాకుంటే ఆ జిల్లాల్లో టూరిజం ప్రమోట్ చేయాలి... లేదా ఐటీని ప్రమోట్ చేయాలి... ఎంఎస్ఎంఈలు ప్రమోట్ చేయాలి.. అగ్రికల్చర్ ప్రమోట్ చేయాలి. ఇలా ఏదో ఒక రంగంలో ఆయా జిల్లాలకున్న ప్రత్యేకతలను, అనుకూలతలను దృష్టిలో పెట్టుకుని ఆయా రంగాల్లో అభివృద్ధి చేయాలి. జిల్లాలకున్న అడ్వాంటేజీలను ప్రమోట్ చేసి పెట్టుబడులను ఆకర్షించాలి. పెట్టుబడులు పెట్టేవారందరూ తమ దగ్గరకే రావాలని జిల్లా కలెక్టర్లు... మంత్రులు అనుకోకూడదు. పెట్టుబడులు పెట్టే వారెవరో గుర్తించి వారిని కలెక్టర్లు, మంత్రులు సంప్రదించే పరిస్థితి రావాలి. ఇదే విధంగా హైదరాబాద్ ను ప్రమోట్ చేయడం వల్లే xూదీ వచ్చింది. జిల్లాల్లో వచ్చిన పెట్టుబడులు, ఉద్యోగాలు, తలసరి ఆదాయం ఎంతమేర పెంచాం అన్నదానిపై జిల్లా కలెక్టర్లు దృష్టి పెట్టాలి. తదుపరి సమావేశం నుంచి ఏ జిల్లా కలెక్టర్ ఎంతమేర పరిశ్రమల్ని ప్రోత్సహించారన్న దానిపై సమీక్షిస్తాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే లాంటి ఇన్ఫ్రా ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. హిందుపూర్ సమీపంలో ఎలక్ట్రానిక్స్ సిటీని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**ఆతిథ్య రంగంలో అభివృద్ధికి ఆస్కారం** : "ఏపీలో ఆతిథ్య రంగానికి పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. అందుకే పర్యాటకానికి పారిశ్రామిక హోదాను కల్పించాం. ఏమీ లేని ప్రాంతాల్లోనే కొన్ని దేశాల్లో టూరిజం అభివృద్ధి చేస్తున్నారు. ఏపీలో అనేక చరిత్రాత్మక ప్రాంతాలు.. ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేసే అంశంపై ఫోకస్ పెట్టాలి. పురాతన కట్టడాలు చాలా ఉన్నాయి.. వాటికి ఎంతో చరిత్ర ఉంటుంది.. వాటిని ఎంకరేజ్ చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల హోటల్ గదులు సిద్ధం కావాలి. వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలు పెద్ద ఎత్తున రావాలి. కన్వెన్షన్ సెంటర్లు, మైస్ సెంటర్లు నిర్మాణం చేయాలి. యుద్ధ ప్రభావాల నేపథ్యంలో విదేశాల కంటే స్థానికంగా ఉండే పర్యాటకానికి పెద్దఎత్తున ఆకర్షణ పెరుగుతుంది. దేవాలయాలు పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాలతో పాటు... మానసిక ఉల్లాసాన్ని కలిగించే ప్రాంతాలు వాటిని అభివృద్ధి చేయాలి. పాపికొండలు, గండికోట భారత్ కే గ్రాండ్ కాన్యన్, సూర్యలంక మరో గోవాగా తయారవుతుంది. జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో ఉన్న పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలి. టూరిజం ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయటంతో పాటు మాన్యుమెంట్లను కూడా అభివృద్ధి చేయాలి. తిమ్మమ్మ మర్రిమాను వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక ప్రాంతంగా మారుతుంది. కంభం చెరువు ఆసియాలోనే అతిపెద్ద మానవ నిర్మిత నీటి వనరు. పులికాట్ సరస్సులో పర్యాటక ప్రాజెక్టును ప్రతిష్టాత్మక కంపెనీలకు అప్పగించి అభివృద్ధి చేయాలి. స్థానికుల్ని ఈ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం చేయటం ద్వారా వేగంగా అభివృద్ధి జరుగుతుంది. జాతీయ రహదారులపై వే సైడ్ అమెనిటీస్, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు, నైట్ హాల్ట్ కోసం గదులు నిర్మాణం చేపడితే పెట్టుబడులు వస్తాయి. ఏపీఐఐసీ ద్వారా చేసే ల్యాండ్ అలాట్మెంట్ లో 5 ఎకరాల వరకూ కేటాయింపులు చేసేలా జిల్లా కలెక్టర్లకు ఆథరైజేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. విజయవాడలోని డిస్నీల్యాండ్, భవానీ ఐ ల్యాండ్ లను పర్యాటకంగా అభివృద్ధి చేద్దాం. అమరావతిలో క్రియేటివ్ సిటీ ఏర్పాటు చేస్తాం. అమరావతిలో కంటెంట్ క్రియేషన్ చేసే వారిని ప్రొత్సహిస్తాం. ఏఐ, ఫిలిం, కంటెంట్ క్రియేషన్ పరిశ్రమలకు పెద్ద పీట వేస్తాం. రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ పెరిగేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## 125 రోజులకు పనిదినాల పెంపు



(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 43.15 లక్షల కుటుంబాలకు ఉపాధి చూపామని ఆయన తన ప్రెజెంటేషన్ లో వెల్లడించారు. అలాగే రాబోయే ఏడాదికి గాను రాష్ట్రానికి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 3,400 కోట్లు రాబోతున్నాయని చెప్పారు.

కొత్తగా రాబోతున్న 'వీబీ-గ్రామ్ జీ' పథకంలో కూలీలకు ఎన్నో అదనపు ప్రయోజనాలు ఉన్నాయని శశిభూషణ్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు ఏటా 100 రోజులు మాత్రమే ఉన్న పనిదినాలను.. ఈ కొత్త చట్టం కింద ప్రతి కుటుంబానికి 125 రోజులకు పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. రోజూవారీ హాజరు నమోదు కోసం ఫేస్ రీడింగ్ , ఈ-కేవైసీలను తప్పనిసరి చేశామన్నారు. యాక్టివ్ గా ఉన్న కూలీల్లో ఇప్పటికే 85 శాతం మందికి ఈ-కేవైసీ పూర్తయిందని, మిగిలిన వారిది మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. కూలీలందరికీ ప్రత్యేకంగా 'గ్రామీణ్ రోజ్ గార్ గ్యారెంటీ కార్డులు' ఇస్తామని, వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే నాట్లు, కోతల సమయంలో ఉపాధి పనులకు 60 రోజుల పాటు సెలవు ప్రకటించే అవకాశం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని ఆయన వివరించారు.

పథకం పర్యవేక్షణ, నిధుల వినియోగంపై వస్తున్న మార్పులను ఆయన ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం ముఖ్యమంత్రి అధ్యక్షతన స్టేట్ కౌన్సిల్, అలాగే చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు కాబోతున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. పీఎం గతి-శక్తితో అనుసంధానం చేస్తూ, మార్చి 31 నాటికి 5 గ్రామాల్లో మోడల్ ప్లాన్లు సిద్ధం చేయాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ ఖర్చుల శాతాన్ని 5.5% నుంచి 9 శాతానికి పెంచారని చెప్పారు. ఇకపై ఈ పథకం కింద సోలార్ లైట్ల ఏర్పాటు, జల్ జీవన్ మిషన్ పనుల నిర్వహణ, గ్రామీణ గ్రంథాలయాలు, బస్ షెల్టర్లు, పార్కింగ్ ఏరియాల నిర్మాణం లాంటి కొత్త పనులు కూడా చేపట్టవచ్చని ఆయన కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

### ఏ పట్టణంలోనూ నీటి ఎద్దడి రానివ్వొద్దు

### 39 క్రిటికల్ పట్టణాలకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం



(మొదటి పేజీ తరువాయి)

నీరు సరఫరా అవుతోందని చెప్పారు.

ఈ నీటి కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 37,723 బోర్ బావుల ద్వారా 251 ఎంఎల్ డీల నీటిని అందిస్తున్నామని, అలాగే 416 నీటి ట్యాంకర్ల ద్వారా మరో 11.97 ఎంఎల్ డీల నీటిని సరఫరా చేస్తున్నామని ఆయన తన ప్రెజెంటేషన్ ద్వారా చూపించారు. నీటి నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రతిరోజూ 11,097 శాంపిల్స్ పరీక్షించి సురక్షితమైన నీటినే సరఫరా చేస్తున్నామన్నారు. ముఖ్యంగా పట్టణాలకు నీరందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిల్వలపై వివరించారు. నరసరావుపేట, సత్తెనపల్లి, మార్కాపురం వంటి చోట్ల ట్యాంకులు వంద శాతం నిండి ఉన్నాయని, కాలువలు కట్టేసే లోపు ఎస్ఎస్ ట్యాంకులన్నింటినీ పూర్తిగా నింపే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని కోరారు.

వేసవి తీవ్రత దృష్ట్యా నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న 39 క్రిటికల్ మున్సిపాలిటీల కోసం ప్రత్యేకంగా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్' సిద్ధం చేశామని సురేష్ కుమార్ పేర్కొన్నారు. బోరు బావుల మరమ్మతులు, ప్రైవేటు బోరు బావుల అద్దె, జనరేటర్ల ఏర్పాటు, కొత్త పైపులైన్ల నిర్మాణం తదితర పనుల కోసం నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఏ ఒక్కపట్టణంలోనూ నీటి ఎద్దడి రానివ్వకూడదని, స్థానిక అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ కలెక్టర్లు పరిస్థితిని నిశితంగా గమనించాలని సూచించారు.

# విశాఖలో రూ.100 కోట్లతో భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 100 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్క్ మరియు రిసార్ట్ విస్తరించి ఉండేలా ప్రణాళికలు రచించామన్నారు. ఇందులో 100 గదుల (ఖవఎం) సామర్థ్యం కలిగిన విలాసవంతమైన రిసార్ట్ ఉంటుందని, సుమారు 300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. "మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రధాన కేంద్రంగా 2017లో ప్రారంభమైన మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్, వినోద రంగంలో దాదాపు తొమ్మిదేళ్ల అనుభవం కలిగి ఉంది. మోడర్న్ గ్రూప్ ఆధ్వర్యంలో వీరు 'మస్తీ ల్యాండ్' బ్రాండ్‌తో అమ్యూజ్‌మెంట్ పార్కులు, గేమింగ్ జోన్లు, రెస్టారెంట్లు మరియు రిసార్టులను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ నిర్వాహకులకు ఈ రంగంలో 40 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉందని" మంత్రి దుర్గేష్ వివరించారు.

ఈ సందర్భంగా లిమంత్రి కందుల దుర్గేష్‌లి మాట్లాడుతూ విశాఖపట్నం నగరం గ్లోబల్ కోస్టల్ టూరిజం హబ్‌గా వేగంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. నగరంలో మెగా అమ్యూజ్‌మెంట్ పార్కులను ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నామని, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి వినోద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

'కొత్త ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం 2024-2029' ప్రకారం ఈ ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అన్ని అనుమతులను త్వరితగతిన మంజూరు చేయనుందన్నారు. ఈ విధానం కింద 25 శాతం వరకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, పారిశ్రామిక టారిఫ్‌ల ప్రకారం విద్యుత్ సరఫరా, 100 శాతం నెట్ ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.

# 6160 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో... ఏపీ జెన్కో చారిత్రాత్మక రికార్డు



(మొదటి పేజీ తరువాయి)

**వేసవి విద్యుత్ అవసరాల కోసం ముందస్తు చర్యలు....:** రాబోయే వేసవిలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశముందని మంత్రి గొట్టిపాటి అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సంస్థలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గృహ, పారిశ్రామిక, వ్యాపార వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ అందించే లక్ష్యంతో దానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తితో పాటు రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను కూడా విజయవంతంగా తీర్చడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సానుకూల సంకేతమని మంత్రి తెలిపారు. ముఖ్యంగా రాబోయే వేసవి నెలల్లో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. విద్యుత్ అంతరాయాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు.

**మౌలిక వసతుల బలోపేతంతో భారం తగ్గింపు :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీ జెన్కోను సర్వనాశనం చేశారని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రైవేట్ సంస్థల నుంచి అధిక ధరలకు అత్యధికంగా విద్యుత్ కొనుగోలు చేసి రాష్ట్ర ప్రజల పై రూ. 32 వేల కోట్ల భారాన్ని మోపారని విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్య ప్రజలపై భారం వేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వినియోగదారులపై భారం తగ్గించేందుకు అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే దేశంలో ఎక్కడాలేని విధంగా 13 పైసల ట్రూ డౌన్ ను ఇప్పటికే అమలు చేసి కొత్త చరిత్ర సృష్టించిందని తెలిపారు. అదే విధంగా విద్యుత్ వ్యవస్థలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో వేల కోట్ల రూపాయిలతో వందలాది సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. కొత్త విద్యుత్ లైన్లను కూడా వేస్తున్నామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, జెన్కో ఎండీ పి. పుల్లారెడ్డి, ఏపీ జెన్కో, ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# "మన మిత్ర - వాట్సాప్ గవర్నెన్స్" ద్వారా ఫోన్‌లోనే పోలీస్ సేవలు




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "మన మిత్ర - వాట్సాప్ గవర్నెన్స్" సేవలను ప్రజలు వినియోగించుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ఈ సేవల ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ మొబైల్ ఫోన్ ద్వారానే ఎఫ్ఐఆర్ కాపీ, ఎఫ్ఐఆర్ స్థితి, ఈ-చలానా వివరాలు వంటి పోలీస్ శాఖకు సంబంధించిన సేవలను సులభంగా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఈ సేవలను పొందాలంటే ముందుగా 95523 00009 నంబర్‌ను మొబైల్‌లో సేవ్ చేసి వాట్సాప్‌లో "ఎఱ" లేదా "ఝఱ" అని మెసేజ్ పంపాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలకు సంబంధించిన మెనూ ప్రత్యక్షమవుతుందని తెలిపారు. అందులో "సేవను ఎంచుకోండి" అనే ఎంపికపై క్లిక్ చేసి అవసరమైన సేవలను ఎంపిక చేసుకోవచ్చని వివరించారు.

మెనూలో "పోలీస్ శాఖ సేవలు" అనే ఎంపికను ఎంచుకుంటే ఎఫ్ఐఆర్ నమోదు, ఎఫ్ఐఆర్ స్థితి తెలుసుకోవడం, ఈ-చలానా వివరాలు వంటి సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

అలాగే సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు చేయాలంటే 1930 నంబర్‌కు కాల్ చేయవచ్చని, అత్యవసర పోలీస్ సహాయం కోసం 112 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వాట్సాప్ ద్వారానే పోలీస్ సేవలను పొందాలని సూచించారు.

# మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా ఏపీ

- **అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం**
- **దేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీలో నూతన అధ్యాయం ప్రారంభమైంది**
- **జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా 25వేల మత్స్యాకార కుటుంబాలకు లబ్ధి**
- **ఈ ప్రాజెక్ట్ ద్వారా మత్స్యకారుల ఉత్పాదకత పెరుగుతుంది**
- **ఎలాంటి అపోహలకు గురికావద్దు, మత్స్యకారులను చూసుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది**
- **నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పిషింగ్ హార్బర్ లో అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్ మెంట్ సెంటర్ కు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్**



**నెల్లూరు(జర్నలిస్ట్ ఫైల్) :** మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా ఏపీ రూపుదిద్దుకుంటుంది. అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం. దేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీలో నూతన అధ్యాయం ప్రారంభమైందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా బోగోలు మండలంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మించనున్న అటానమస్ మారిటైం షిప్ యార్డ్, సిస్టమ్స్ డెవలప్ మెంట్ సెంటర్ కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. దేశంలోనే తొలి అటానమస్ మెరైన్ షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు రాష్ట్రానికి గర్వకారణం. ఈ రోజు ఇక్కడ జరుగుతున్న కార్యక్రమం కేవలం ఒక కొత్త పరిశ్రమ ప్రారంభం మాత్రమే కాదు.. భారతదేశ సముద్ర సాంకేతికత, తీర భద్రత, బ్లూ ఎకానమీకి ఒక కొత్త అధ్యాయం ప్రారంభం. భారతదేశం ఒక సముద్ర దేశం. మన దేశానికి 7,500 కిలోమీటర్లకు పైగా తీరరేఖ ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు దేశంలో రెండో పొడవైన తీరరేఖ ఉంది. మనకు సముద్రం అంటే.. అదో జీవనోపాధి, వాణిజ్యం, సంస్కృతి, అవకాశాల కేంద్రం. మన తీరప్రాంత జిల్లాల్లో లక్షలాది కుటుంబాలు తమ జీవనోపాధి కోసం సముద్రంపై ఆధారపడుతున్నాయి. మన మత్స్యకారులు ప్రతిరోజు అనిశ్చితమైన సముద్రంలోకి వెళ్లి, తమ ప్రాణాలను పణంగా పెట్టి మనకు ఆహారం అందిస్తున్నారు. తీరప్రాంత ఆర్థిక వ్యవస్థను నిలబెడుతున్నారు. అందుకే తీరప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి, సముద్ర భద్రత, మత్స్యకారుల కోసం సాంకేతికత మనకు అత్యంత ముఖ్యమైనవి. ఈ రోజు ప్రారంభమవుతున్న ప్రాజెక్ట్ వాటిని సాకారం చేస్తుంది.

**జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ద్వారా 25వేల మత్స్యాకార కుటుంబాలకు లబ్ధి :** జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను రూ. 288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేయడం జరిగింది. ఈ హార్బర్‌లో ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ లు, వేలం హాళ్లు, వలల మరమ్మతు యార్డ్‌లు, అంతర్గత రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయంతో పాటు చేపల నిర్వహణ సదుపాయాలు వంటి ఆధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ హార్బర్ ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయి. సుమారు 1,250 మెకనైజ్డ్, మోటరైజ్డ్ చేపల పడవలను సురక్షితంగా నిలిపే సదుపాయం కల్పించాం. ప్రతి ఏడాది ఈ హార్బర్ ద్వారా 41 వేల టన్నుల చేపలు దిగుబడి జరుగుతోందని అంచనా. దీని వల్ల నెల్లూరు జిల్లాలో మత్స్య ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. అయితే ఇక్కడ భద్రత అనేది చాలా ముఖ్యం. తుఫానులు, తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో మన మత్స్యకారులు సముద్రంలో భారీ ప్రమాదాలను ఎదుర్కొంటారు. అలాంటి సందర్భాల్లో ఈ హార్బర్ సేఫ్ షెల్టర్ లా పనిచేస్తుంది. మత్స్యకారులు తమ కష్టంతో కొనుగోలు చేసిన పడవలు, ఇంజన్ లు, వలలు వంటి ఆస్తుల పరిరక్షణకు సహాయపడుతుంది. మత్స్యకార కుటుంబాలకు పడవ అంటే కేవలం పరికరం కాదు.. అది వారి జీవనోపాధి. ఆ జీవనోపాధిని కాపాడటం మన బాధ్యత.

**దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు :** జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పక్కనే భవిష్యత్ దిశగా అడుగు వేసే మరో ప్రాజెక్ట్ కు నేడు శంకుస్థాపన చేశాం. 29.58 ఎకరాల విస్తీర్ణంలో సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ బిల్డింగ్, సిస్టమ్స్ డెవలప్ మెంట్ సెంటర్ ను నిర్మిస్తోంది. ఈ కేంద్రంలో ఆధునిక సముద్ర సాంకేతికతలను రూపకల్పన చేసి తయారు చేస్తారు. మనుషుల్లేని సముద్ర ఉపరితల నౌకలు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్, ఏఐ ఆధారిత సముద్ర పర్యవేక్షణ వ్యవస్థలు, నావిగేషన్ సాంకేతికతలను రూపొందించనున్నారు. ఇవి తీరప్రాంత పర్యవేక్షణ, పోర్ట్ భద్రత, విపత్తు నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ, సముద్ర రక్షణ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. సముద్ర భద్రత ఎంత ముఖ్యమో మనందరికీ తెలుసు. తీర పర్యవేక్షణ, సముద్ర భద్రతను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యం.

**మత్స్యకారుల ఉత్పాదకత పెరుగుతుంది :** ఇక్కడ అభివృద్ధి చేస్తున్న అటానమస్ మారిటైం సిస్టమ్స్.. మన జలాలను సంరక్షించడంతో పాటు పోర్టుల భద్రత, దేశాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతోపాటు ఈ సాంకేతికతలు మన మత్స్యకారులకు కూడా ఉపయోగపడతాయి. భవిష్యత్తులో ఇవి మత్స్యకారులకు రియల్ టైంలో వాతావరణ సమాచారం, చేపల గుర్తింపు, నేవిగేషన్ సహాయం వంటి సేవలను అందిస్తాయి. దీంతో సముద్రంలో భద్రత పెరుగుతుంది, ఇంధన వ్యయం తగ్గుతుంది, మత్స్యకారుల ఉత్పాదకత పెరుగుతుంది. సాంకేతికత రక్షణ కోసం మాత్రమే కాకుండా సాధారణ ప్రజల జీవితాలను మెరుగుపర్చడానికి కూడా దోహదపడాలి.

**మత్స్యకారులను చూసుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది :** మత్స్యకారులను చూసుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వానిది. ఈ ప్రాజెక్ట్ పట్ల మీకు ఎలాంటి అపోహలు అవసరం లేదు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అద్భుతమైన మారిటైం కంపెనీని తీసుకువచ్చాం. వీరు ఓ వైపు డిఫెన్స్ పరికరాలు తయారుచేస్తూ.. మనకు కూడా అండగా నిలబడతారు. మన సంపద, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు సహకారం అందిస్తారని మత్స్యకార సోదరులకు హామీ ఇస్తున్నా. మత్స్యకార కుటుంబాల్లోని యువతలో అపార నైపుణ్యాలు ఉన్నాయి. ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంస్థను కోరుతున్నా.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా బలం :** రాష్ట్రంలో ఎందుకు పెట్టుబడులు పెట్టాలో మూడు బలమైన కారణాలు ఉన్నాయి. మొదటిది చంద్రబాబు గారి బ్రాండ్. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ విశ్వసనీయత, దూరదృష్టి పరిశ్రమలతో దీర్ఘకాల భాగస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. రెండోది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ఏపీలో పెట్టుబడి పెట్టాలని నిర్ణయించిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. ప్రభుత్వ ప్రాజెక్ట్ అవుతుంది. త్వరితగతిన పెట్టుబడి సాకారం అయ్యేలా చూస్తాం. మూడో కారణం.. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండటంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. నమో అంటే నాయుడుజీ, మోదీజీ కలయిక.

**మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా ఏపీ :** సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థకు భారత్ బయోటెక్ కీలక పెట్టుబడిదారుగా మద్దతు ఇస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఇంజనీర్లు, సముద్ర సాంకేతిక నిపుణులు, రోబోటిక్స్ నిపుణులు, యువ ఆవిష్కర్తలకు అధిక నైపుణ్య ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సముద్ర సాంకేతికతలో పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం ఇస్తుంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, అటానమస్ మారిటైం షిప్ యార్డ్ ఈ ప్రాంతాన్ని మత్సరంగం, సముద్ర సాంకేతికతకు ప్రధాన కేంద్రంగా మార్చబోతున్నాయి. తీర భద్రతను బలోపేతం చేస్తుంది. మత్స్యకారుల జీవనోపాధికి మద్దతు ఇస్తుంది. ఆంధ్రప్రదేశ్‌ను మారిటైం ఇన్నోవేషన్, అటానమస్ సిస్టమ్స్ గ్లోబల్ హబ్ గా నిలుపుతుంది. ఈ రోజు జరిగిన శంకుస్థాపన కేవలం ఒక నిర్మాణానికి ప్రారంభం మాత్రమే కాదు.. నూతన వ్యవస్థకు ఆరంభం. ఈ ప్రాజెక్ట్‌ను సాకారం చేసిన సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్, భారత్ బయోటెక్, ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డ్, ఇతర భాగస్వాములకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ ప్రాజెక్ట్ గొప్ప విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. ఏ అవసరం వచ్చినా వాట్సాప్ మెసేజ్ దూరంలో ఉంటానని మంత్రి చెప్పారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమానికి తరలివచ్చిన స్థానిక మత్స్యకారులను ఆప్యాయంగా పలకరించి వారితో ఫోటోలు దిగారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పి.సునీల్ కుమార్, ఎన్.విజయశ్రీ, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర యాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి, సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈవో కెప్టెన్ నికుంజ్ పరాశర్, సీహెచ్ ఆర్వో సన్యుక్తా సింగ్, ఆర్కేపీ సింగ్, ఏపీ మారిటైం బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

- **రైతుల ఖాతాల్లో రూ. 135.48 కోట్ల జమ**
- **జిల్లాలో 2,40,530 మందికి ప్రయోజనం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ - పీఎం-కిసాన్' పథకం కింద, రాష్ట్రంలోని అర్హులైన రైతులకు మూడవ విడత ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పథకం ద్వారా భూమి కలిగిన రైతు కుటుంబాలకు మరియు ఆర్ఓఎఫ్ఆర్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు ఏడాదికి మొత్తం రూ. 20,000 చొప్పున (అన్నదాత సుఖీభవ నుంచి రూ. 14,000 మరియు పీఎం-కిసాన్ నుంచి రూ. 6,000) మూడు విడతల్లో ప్రభుత్వం అందజేస్తోంది. ప్రభుత్వం మూడవ విడత నిధులను రూ. 6,000 చొప్పున శుక్రవారం రైతుల ఖాతాల్లో జమచేయనుంది.

**మూడవ విడత వివరాలు:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, మూడవ విడత నిధులను మార్చి 13న ప్రభుత్వం విడుదల చేయనుంది. దీని కింద అన్నదాత సుఖీభవ పథకం నుంచి రూ. 4,000 మరియు పీఎం-కిసాన్ పథకం నుంచి రూ. 2,000 కలిపి, మొత్తం రూ. 6,000 లబ్ధిదారులైన రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. మొదటి విడతగా 2025 ఆగస్టు 2న, రెండవ విడతగా 2025 నవంబరు 19 రైతుల ఖాతాల్లో రూ. 7,000 చొప్పున జమ చేయడం జరిగింది

**కార్యక్రమ వివరాలు:** అన్నదాత సుఖీభవ-పిఎం -కిసాన్ మూడవ విడత నిధుల విడుదలకు సంబంధించి రాష్ట్ర స్థాయి కార్యక్రమం శుక్రవారం కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో సాయంత్రం 4:00 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని నగదు జమ చేస్తారు. అదే రోజు జాతీయ స్థాయి కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని గువాహటిలో సాయంత్రం 5:00 గంటలకు ప్రారంభించనున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా :** అన్నదాత సుఖీభవ- పిఎం-కిసాన్ పథకం ద్వారా జిల్లాలో మూడవ విడతలో మొత్తం 2,40,530 మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. వీరి ఖాతాల్లో సుమారు రూ. 135.48 కోట్ల ఆర్థిక సహాయం జమ కానుంది. ఈ నగదును రైతులు తమ తదుపరి పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు మరియు ఇతర వ్యవసాయ అవసరాల కోసం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కోరారు.

# పల్నాడు జిల్లాలో 'సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

- **అధికార యంత్రాంగం అప్రమత్తం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రానున్న వేసవిలో తీవ్రమైన ఎండ, వడదెబ్బలు, తాగునీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కోవడానికి పల్నాడు జిల్లా యంత్రాంగం సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాడేపల్లిలో మార్చి 10న ప్రవేశపెట్టిన హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ 2026 మార్గదర్శకాల మేరకు పల్నాడు జిల్లాలో జీరో క్యాజువాల్టీ (మానవ మరియు పశు మరణాలు శూన్యం) లక్ష్యంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి. నారద ముని, నరసరావుపేట ఆర్.డి.ఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వారు తమ శాఖల వారీగా రూపొందించిన ముందస్తు ప్రణాళికలను వివరించారు.

**కీలక నిర్ణయాలు :** వడదెబ్బ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి సచివాలయం, ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో అవగాహన పోస్టర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల సంస్థ నుంచి వచ్చే హీట్ అలర్ట్‌లను వెంటనే ప్రజలకు చేరవేయాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారికి తక్షణ చికిత్స అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్సీ)ల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిడాక్టర్ రవికి ఆదేశాలు జారీ చేశారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, కూడళ్లలో చలివేంద్రాలు (కూలింగ్ షెల్టర్లు) ఏర్పాటు చేసి, మజ్జిగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట ప్రత్యేక వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడంతోపాటు మంచినీటి చెరువులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల పని వేళలను సవరించారు. కూలీలు ఉదయం 7:00 నుండి 11:00 గంటల వరకు, సాయంత్రం 4:00 నుండి 7:00 గంటల వరకు మాత్రమే పని చేయాలి. మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల మధ్య బహిరంగ పనులు నివారించాలి. పని ప్రదేశాల్లో నీడ మరియు తాగునీటి సౌకర్యం కల్పించడం తప్పనిసరి చేశారు. పశువులకు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక శాఖతో సమన్వయం చేసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో డి.పి.ఓ ఈ. నాగేశ్వర్ నాయక్, ఆర్టీసీ ఆర్.ఎం రజిత కుమారి, వివిధ మున్సిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు న్యాయం చెయ్యకపోతే ఎలా?

- **బిజెపి మండల అధ్యక్షులు చంద్ర ఓబులరెడ్డి రెడ్డి**



**బ్రహ్మంగారి మఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండలం పలుగు రాళ్లపల్లి పాపిరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామాలలో అసైన్మెంట్ కమిటీ ద్వారా డి పట్టాలు పొందిన ప్రతి ఒక్కరికి వ్యవసాయ భూమి చూపించి న్యాయం చేయాలని భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రకాంతం ఈశ్వరయ్య అన్నారు గురువారం రెవెన్యూ కార్యాలయంలోని తాసిల్దార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల నోట్లో మన్ను కొట్టి పెద్దలకు లాభం చేకూర్చే విధంగా ప్రయత్నాలు చేయడం బాధాకరమైన విషయం అన్నారు అసైన్మెంట్ కమిటీ ద్వారా లబ్ధి పొందిన భూములను ఇంతవరకు చూపకుండా కాలయాపన చేస్తూ ఉన్నట్లు ఉండి ప్రైవేట్ కంపెనీ వారికి అప్పగించాలని చూడటం భావ్యం కాదన్నారు తమ భూములు చూపాలని దాదాపు 16 సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఏ ఒక్క అధికారి కూడా స్పందించకపోవడం బాధాకరమైన విషయం అన్నారు పలుగు రాళ్లపల్లి పాపిరెడ్డి పల్లె రెవిన్యూ గ్రామాలలో అసైన్మెంట్ కమిటీ ద్వారా ఇచ్చినటువంటి డి పట్టాల లబ్ధిదారులు ఎక్కువ మంది దళితులు అణగారిన వర్గాల వారు ఉన్నారని చేయాల్సిన బాధ్యత కూటమిదే అన్నారు. పేదలకు కేటాయించిన సారవంతమైన పొలాలను ప్రైవేట్ యాజమాన్యం వారికి ఏ ప్రతిపాదికన కేటాయిస్తారని ఇప్పటికైనా అధికారులు పునరాలోచించుకోవాలని మరో మారు తెలియజేస్తున్నామన్నారు. పేదలకు న్యాయం చేయకుండా కంపెనీ యాజమాన్యానికి పేదల భూములు కట్టబెడితే అసైన్మెంట్ కమిటీ లబ్ధిదారులతో కలిసి దీక్షలు కొనసాగిస్తామన్నారు భారతీయ జనతా పార్టీ బ్రహ్మంగారిమఠం మండల సమన్వయకర్త పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి ఉదయనాథ్ రమణయ్య తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థుల మానసిక సంరక్షణ గూర్చి అవగాహన

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష పరిధిలో కొత్తగా బదిలీపై వచ్చిన కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎన్. ప్యారీ జాన్ మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా కాకుమాను మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, చదువులో ఏకాగ్రత పెంపు మరియు భవిష్యత్తులో విజయాన్ని సాధించడానికి లక్ష్య నిర్ధారణ ఎంత ముఖ్యమో వివరిస్తూ ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థులలో సమగ్ర అభివృద్ధి కలగాలంటే వారు మానసికంగా బలంగా ఉండాలని, భావోద్వేగ సమతుల్యత (ఎమోషనల్ వెల్ - బీయింగ్ ) కూడా చాలా అవసరమని వివరించారు. కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు ప్రధానంగా విద్యార్థుల మానసిక శ్రేయస్సు పెంపొందించడం, వారి సమస్యలను వినడం, సరైన మార్గదర్శనం ఇవ్వడం మరియు వారి ఓవరాల్ డెవలప్మెంట్ కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు.

గుంటూరు జిల్లాలో మొత్తం 18 మంది కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు సేవలందిస్తున్నారన్నారు . అందులో భాగంగా కాకుమాను మండలానికి ఎన్. ప్యారీ జాన్ ని కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్‌గా నియమించారన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లా స్థాయిలో ఏపీసీ పద్మావతి మరియు జీసీడి ఓ (గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ) వి. సుజాత పర్యవేక్షిస్తున్నారు. మండల స్థాయిలో ఎంఈఓల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడుతు న్నాయన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యం మరియు భవిష్యత్తు లక్ష్యాల సాధనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఉపాధ్యాయులు తెలిపారు.

# బాలికల ఆరోగ్య సంరక్షణకు హెచ్.పి.వి టీకా తప్పనిసరి



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం హెచ్.పి.వి టీకా కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చిలేకాంపల్లి వీరనారాయణరెడ్డి మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తగా మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు 14 నుండి 15 ఏళ్లలోపు బాలికలందరూ తప్పనిసరిగా హెచ్.పి.వి వ్యాక్సిన్ వేయించుకోవాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఈ టీకా వేయించడం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి యుక్త వయసు బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ విషయంపై అవగాహన పెంచుకొని వారి పిల్లలకు ఆరోగ్యంగా ఉండేందుకు బాటలు వేయాలని ఆయన కోరారు. వ్యాధి వచ్చాక బాధపడటం కంటే, రాకముందే నివారించడం మేలన్నారు. ముఖ్యంగా బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ టీకా వేయించాలని ఈ వ్యాక్సిన్ పూర్తి సురక్షితమైనది అని వివరించారు. ఈ కార్యక్రమంలో గురువారం సుమారు 14 నుండి 15 ఏళ్ల లోపు వయస్సు గల 20 మందికి బాలికలు హాజరై టీకాలు వేయించుకున్నారు. టీకాలు వేసిన అనంతరం విద్యార్థులకు ఎంపీపీ వీరనారాయణరెడ్డి సుబ్బారెడ్డి చేతులు మీదుగా సర్టిఫికెట్లను కూడా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు నరసింహ గౌడ్ మల్లేపల్లి సుధాకర్, నాగయ్య గంగరాజు హెల్త్ అసిస్టెంట్లు మాధవ నాయుడు వెంకటరెడ్డి ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు

### మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. కిషోర్ బాబు

**జి.కొండూరు, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**

నేషనల్ హైవేపై వన్‌వే నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రమాదకరంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. కిషోర్ బాబు హెచ్చరించారు. జి.కొండూరు జంక్షన్ వద్ద విజయవాడ వైపు ట్రాఫిక్‌కు వ్యతిరేక దిశలో ప్రయాణిస్తున్న హెవీ ట్యాంకర్ లారీలపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కే. కిషోర్ బాబు, జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ ఆధ్వర్యంలో రెండు హెవీ ట్యాంకర్ లారీలను స్వాధీనం చేసుకుని సంబంధిత డ్రైవర్లపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నేషనల్ హైవేపై వన్‌వే ఉల్లంఘిస్తూ ట్రాఫిక్‌కు వ్యతిరేక దిశలో ప్రయాణించే ఏ వాహనమైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగి కుటుంబాలు నష్టపోకుండా వాహన దారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత కోసం వన్‌వే ఉల్లంఘనలు, ప్రమాదకర డ్రైవింగ్‌పై ఇలాంటి చర్యలు కొనసాగిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

## మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని మర్యాదపూర్వకంగా శీలం బ్రహ్మయ్య



**మైలవరం, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**

మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బదిలీపై వచ్చిన కే కిషోర్ బాబు ని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా మైలవరంలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేసిన జనసేన నాయకులు. ఈ కార్యక్రమంలో మైలవరం టౌన్ ఉపాధ్యక్షులు జీ.వి రవితేజ ,మ ండల నాయకులు ఆకుతోట ఈశ్వర్,కూసుమంచి కిరణ్ కుమార్,చంద్రాల మురళీకృష్ణ, పొన్నూరు విజయ్,చంద్రగూడెం పిఎసిఎస్ డైరెక్టర్ ప్రత్తి తిరుపతిరావు, గ్రామపార్టీ అధ్యక్షులు ఏ.శివరాం ప్రసాద్,మేరుగ నాగేశ్వర రావు(నాని),పాల్ రాజ్,పసుపులేటి నాగరాజు జనసేన నాయకులు శీలం కృష్ణమూర్తి,దావీదు ,కళ్యాణ్,లేళ్ల జగదీష్,బాలబోలు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో రాజకీయాలకు తావులేదు

### తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్



**మైలవరం, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**

పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధనే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, రాజకీయాలకు ఎలాంటి తావు ఉండకూడదని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లితీష్ అన్నారు. దేవునిచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల జరిగిన సంఘటనపై ఆయన స్పందిస్తూ, ఉపాధ్యాయులు ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం పని చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. పాఠశాలలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే వ్యక్తిగత దూషణలు, విభేదాలకు పోకుండా అధికారుల దృష్టికి లేదా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దేవునిచెరువు పాఠశాలలో జరిగిన సంఘటనపై 24 గంటలు గడవకముందే ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్యను పరిష్కరించారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన పాఠశాలల్లో అనవసర రాజకీయాలు చేస్తే సహించబోమని లంకా లితీష్ హెచ్చరించారు.

## నకిలీ వరి విత్తనాలతో నట్టేట మునిగాం

### తంటికొండ,గాదెలపాలెం రైతులు ఆవేదన



**గోకవరం, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**

నకిలీ వరి విత్తనాలు సాగుచేసి పెట్టుబడి మొత్తం నష్టపోయే పరిస్థితుల్లో ఉన్నామని మండలంలోని తంటికొండ గాదెలపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన చెందుతున్నారు.రబీ సీజన్లో కోరుకొండ మండలం కాపవరం గ్రామంలోని దేవి ఏజెన్సీలో సిరి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన సిరి 1166 , సిరి సూపర్ 66 వంటి వరి విత్తనాలను కొనుగోలు చేసి సుమారు 800 ఎకరాల్లో సాగు చేశామని అయితే కోత దశకు కొన్ని రోజులు ముందు వరి కంకులు తెల్లగా మారి పాలు గింజల తయారై కంకులు విరిగిపోతున్నాయని గ్రహించి సమస్యను విత్తనాల డీలర్ కు తెలియపరచగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని తంటికొండ గాదెలపాలెం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఈ విషయాన్ని మండల వ్యవసాయ అధికారులకు తెలియపరచగా మండల వ్యవసాయ అధికారిణి రాజేశ్వరి కోరుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు డి శ్రీనివాసరావు ఆయా గ్రామాల సందర్శించి వరి పంటను పరిశీలించారు. ఎకరాకు దాదాపు 50 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేశామని ప్రస్తుతం కనీసం 20 శాతం కూడా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని దీంతో పెట్టుబడి పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉందని అధికారులు నాయకులు నకిలీ విత్తనాలను అమ్మిన దేవి ఏజెన్సీ పై కఠిన చర్యలు తీసుకొని రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు కోరుచున్నారు. ఏవో రాజేశ్వరి మాట్లాడుతూ వరి పంటలో తెల్ల కంకులు ఎండు తెగులు బ్యాక్టీరియా గమనించడం జరిగిందని , నష్ట శాతం పరిశీలించేందుకు శాస్త్రవేత్తల సందర్శనకు ఉన్నతాధికారులను కోరడం జరిగిందని తెలిపారు.

# అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత కేబీఎన్







- రన్నరప్‌గా నున్న విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు

**విజయవాడ, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (వీజీటీఎన్) కళాశాలల ఆవరణలో విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల (కేఆర్‌యూఐసీ) పురుషుల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో విజయవాడకు చెందిన కేబీఎన్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. అలాగే ఆతిథ్య విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.లీగ్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌లలో విజయం సాధించిన కేబీఎన్ కాలేజీ ఛాంపియన్‌గా అవతరించింది. టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చిన నున్నకు చెందిన విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు రెండు విజయాలతో రెండో స్థానంలో నిలిచింది. మైలవరానికి చెందిన డాక్టర్ లకిరెడ్డ హనిమీరెడ్డి (ఎల్‌హెచ్‌ఆర్) ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఒక విజయంతో మూడో స్థానాన్ని దక్కించుకోగా, విజయవాడకు చెందిన పీబీ సిద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ జట్టు నాలుగోస్థానంలో నిలిచింది. నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (వీజీటీఎన్) ప్రాంగణంలో నిర్వహించిన ఈ రెండు రోజుల టోర్నమెంట్ బుధవారం ముగిసింది. నాకౌట్-కమ్-లీగ్ విధానంలో జరిగిన ఈ పోటీలలో కృష్ణా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న అనేక కళాశాలల జట్లు పాల్గొన్నాయి. లీగ్ మ్యాచ్‌లలో కేబీఎన్ కాలేజీ, విజయవాడ జట్టు విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, నున్న జట్టును 20-7 తేడాతో, పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, విజయవాడ జట్టును 34-14 తేడాతో, డా. ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, మైలవరం జట్టును 40-16 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.రన్నరప్‌గా నిలిచిన విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, నున్న జట్టు డా. ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, మైలవరం జట్టును 18-13తో, పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, విజయవాడ జట్టును 19-10తో ఓడించింది. అలాగే డా. ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, మైలవరం జట్టు పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, విజయవాడ జట్టుపై 21-13తో విజయం సాధించి మూడో స్థానాన్ని పొందింది. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (వీజీటీఎన్) ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యదర్శి మరియు కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణ రెడ్డి మొదటి, రెండో, మూడో మరియు నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణా యూనివర్సిటీ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు కూడా ఎంపిక చేయబడింది.ఈ కార్యక్రమంలో విజయా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డా. బి. ఉదయ్ కుమార్, సెలక్షన్ కమిటీ సభ్యులు మేజర్ మన్నే స్వామి, డి. హేమచంద్రరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. విజయ్, బీపీఈడీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డి. రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు

**మైలవరం, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**




ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మైలవరం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ క్రైమ్, డ్రగ్స్ మరియు మహిళలపై జరిగే నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీపీ రూరల్ లక్ష్మీనారాయణ, ఐపీఎస్ మరియు మైలవరం సబ్ డివిజన్ ఏసీపీ ప్రసాదరావు సూచనలపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, షాపు యజమానులు, ఆటో యూనియన్ ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల ఫోన్ కాల్స్‌ను నమ్మకూడదని, ఓటీపీ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. “డిజిటల్ అరెస్ట్” పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌కు భయపడవద్దని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియాలో తెలియని లింకులు, ట్రేడింగ్ యాప్‌లపై క్లిక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్క్ చేయకూడదని, షాపు యజమానులు తమ దుకాణాల ముందు రోడ్డుపై వస్తువులు పెట్టి ట్రాఫిక్‌కు అడ్డంకులు కలిగించవద్దని తెలిపారు. ఆటో డ్రైవర్లు కూడా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను ఎక్కించేటప్పుడు, దింపేటప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని చెప్పారు. ఈ సూచనలను అతిక్రమించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రసాదరావు, మైలవరం సీఐ కే. కిషోర్ బాబు, మైలవరం--2 ఎస్సై గిరి సాయి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, ఆటో యూనియన్ ప్రతినిధులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ

# బోర్డు పూర్తి స్థాయిలో పునరుద్ధరణ చేయాలని బైక్ ర్యాలీ

**బాపులపాడు, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**




భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డు ను పూర్తి స్థాయిలో పునరుద్దరణ చేయాలని కోరుతూ గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బాపులపాడు మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం వద్ద ప్రారంభం అయిన ఈ ర్యాలీ పలు గ్రామాల్లో పర్యటించింది. ఉంగుటూరు మండలంలోని తేలప్రోలు, పొట్టిపాడు, ఆత్కూరు, ఆవుటపల్లి గ్రామాల గుండా వెళ్లి తరిగొప్పల మీదుగా మానికొండ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా కార్మికులు పెద్దఎత్తున పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజనాల సురేష్ మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో సంబంధం లేకుండా ఈ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. అలాగే, 2019 నుండి పెండింగ్ లో ఉన్న (మంజూరైన) క్లెయిమ్ లకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ ర్యాలీ ద్వారా ప్రతి గ్రామంలోని కార్మికులకు తమ సమస్య లను వివరించామని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 6న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తరపున ఈ ధర్నాకు భవన నిర్మాణ కార్మికులందరూ భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కృష్ణాజిల్లా క్లస్టర్ కార్యదర్శి బేతా శ్రీనివాసరావు, బాపులపాడు మండల కమిటీ సభ్యులు రాజులపాటి కొండలరావు, హనుమాన్ జంక్షన్ టౌన్ కమిటీ అధ్యక్షుడు వడ్డీ గిరిధర్, సీతారామయ్య, బేతాళ ప్రసాద్, సలాది నరసయ్య, ఉంగుటూరు మండల కార్యదర్శి వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు తదితరులు కార్మికులకు మద్దతు తెలియజేశారు.

# పందులు, కుక్కల వలన ప్రజారోగ్యానికి ప్రమాదం

- గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి శ్రీనివాసులు

**పలమనేరు, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్)**

పందులు,కుక్కల వలన ప్రజారోగ్యానికి ప్రమాదమని గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి శ్రీనివాసులు అన్నారు. గంగవరం మండల కేంద్రంలో పందులు, కుక్కల బెడదపై ప్రజలకు కలిగే అనర్థాలను బుధవారం ఆయన మీడియాకు వివరించారు.పందులు మరియు కుక్కల వలన మనుషులకు వచ్చే కొన్ని జూనోటిక్ వ్యాధులు (జంతువుల నుండి మనుషులకు వచ్చే వ్యాధులు) ఉంటాయని అందులో పందుల వలన స్వైన్ ఫ్లూ వాటిలో ఉండే ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వలన వస్తుందని,దీని లక్షణాలు జ్వరం,దగ్గు, గొంతు నొప్పి,శరీరం నొప్పులు కలగడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా వాటి సంచారం ఎప్పుడూ మురుగునీటి లోనే ఉంటుంది కాబట్టి దీనివలన కూడా మరిన్ని అంటువ్యాధులు మనుషులకు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు.కుక్కకాటు వలన రాబిస్ వ్యాధి వస్తుందని ఇది చాలా ప్రమాదకరమని దీనికి మందు లేదని,నివారణ ఒక్కటే మార్గమని, ఒక్కొక్క సారి మనుషుల ప్రాణాలు కూడా పోయే పరిస్థితి ఏర్పడు తుందని అన్నారు.వాటి కాటుతోనే కాకుండా కుక్క నోటి నుండి చొంగ మరియు మూత్రం ద్వారా కూడా రాబిస్ వచ్చే ప్రమాదం ఉందని అన్నారు.కుక్కల చర్మం ద్వారా వ్యాపించే ఫంగస్ కారణంగా చర్మంపై వలయాకార దద్దుర్లు వస్తాయని అన్నారు.వాటి సమీపంలో వెళ్లిన ప్రతిసారి చేతులు మరియు కాళ్ళు నీటితో శుభ్రం చేసుకోవాలని అన్నారు.కుక్క కరిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దగ్గరికి వెళ్లాలని అలాగే పెంపుడు జంతువులకు ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని ఆయన అన్నారు.ఇంతటి ప్రాణాంతక వ్యాధులు పందులు మరియు కుక్కల ద్వారా మనుషులకు వస్తాయని కావున జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.



# కౌన్సిల్ సమావేశాలు లేకుండా నిధుల కేటాయింపు సమంజసం కాదు

కౌన్సిలర్ గాదె వెంకటేష్



శామీర్ పేట ,(జర్నలిస్ట్ ఫైల్): అలియాబాద్ మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా కమిషనర్, చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలతో వార్డులకు బడ్జెట్ కేటాయించడం సమంజసం కాదని కౌన్సిలర్ గాదె వెంకటేష్ ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను పక్కనబెట్టి విధి విధానాలను విస్మరించి నిధుల కేటాయింపులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా గాదె వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి చర్చలు జరిపిన తర్వాతే అభివృద్ధి పనులకు బడ్జెట్ కేటాయించాల్సి ఉంటుందని అన్నారు. అయితే సమావేశాలు ఏర్పాటు చేయకుండా తమ ఇష్టానుసారంగా నిధులు కేటాయిస్తూ "ఇది గ్రామపంచాయతీ వ్యవస్థ కాదు, మున్సిపల్ వ్యవస్థ" అంటూ కమిషనర్ వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరమని తెలిపారు.తాను ప్రజల ఓట్లతో ఎన్నికైన కౌన్సిలర్‌గా వార్డు అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఉందని, కానీ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా తమ వార్డుకు ఇంత నిధులు అని ఏకపక్షంగా నిర్ణయించడం వల్ల ప్రజల సమస్యలను పరిష్కరించే అవకాశం లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు విధి విధానాల ప్రకారం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపల్ పాలనలో పారదర్శకత ఉండాలంటే కౌన్సిల్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు.

# సాక్షాత్తు షాద్నగర్ ఆర్టీవో కార్యాలయం సమీప హైవేపై చెల్లాచెదురుగా దర్శనమిస్తున్న చెత్త

కొందరు వ్యక్తులు రాత్రివేళల్లో చెత్తను ఇక్కడ పడేస్తున్నారని వినికిడి

మఠం ఋషికేష్ బిజెపి షాద్ నగర్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు



షాద్నగర్ నియోజకవర్గం మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) :

షాద్నగర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు రాత్రనక, పగలనక షాద్నగర్ పట్టణాన్ని సుందరీకరణగా తీర్చిదిద్దాలని స్వచ్ఛ్ షాద్నగర్ లక్ష్యంగా పనిచేస్తుంటే షాద్నగర్ పుర పౌరులు కొందరు మాత్రం తమకేమాత్రం బాధ్యత లేదన్నట్టు బాధ్యతారహితంగా ఇలా జడ్చర్ల పాత హైవే ఆర్టీవో కార్యాలయ సమీపంలో చెత్త వేయడం సరైనది కాదు అలాగే తాము నివసిస్తున్న వార్డుకు ఒక గార్బేజ్ చెత్త సేకరించడానికి వాహనాలు రోజువారీగా అందుబాటులో ఉన్నాయి లేక మీరు మీ యొక్క ఉద్యోగరీత్యా సమయానికి చెత్తను సేకరించే వారికి వేయడానికి అందుబాటులో లేకపోతే ఇంటి దగ్గరే ఒక గార్బేజ్ డబ్బాను ఏర్పాటు చేసుకొని అందులో పొందుపరిస్తే చెత్త సేకరించడానికి వచ్చిన వ్యక్తికి సమాచారం ఇచ్చి తీసుకెళ్లేలా ప్రత్యామ్నాయంగా ఆలోచించాలి తప్ప ఇలా తమకు ఏ మాత్రం పట్టనట్టుగా రోడ్డుపై చెత్త వేయడం సరైనది కాదు అలాగే షాద్నగర్ పట్టణ అభివృద్ధి కేవలం ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు లేదా ఇతర నాయకుల బాధ్యత కాదు షాద్నగర్ పట్టణంలో నివసిస్తున్న ప్రతి ఒక్క షాద్నగర్ పుర పౌరుడు బాధ్యత వహిస్తేనే షాద్నగర్ పట్టణం అభివృద్ధి చెందుతుంది కాబట్టి ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా బాధ్యత వహించాలని బిజెపి షాద్నగర్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు మఠం ఋషికేష్ తమయొక్క ప్రకటన ద్వారా తెలియజేశారు

# యుద్ధాన్ని అడ్డం పెట్టుకొని ఇష్టం వచ్చినట్లు ధరలను పెంచడం సరికాదు : సి.పి.ఐ



ఖమ్మం, మార్చి 12(జర్నలిస్ట్ ఫైల్): యుద్ధాన్ని అడ్డం పెట్టుకొని నిత్యావసర సరుకులు ఇష్టం వచ్చినట్లు బ్లాక్ మార్కెట్లు ఇష్టం వచ్చినట్లు నిత్యావసర వస్తువులపై తీవ్రంగా ధరలను పెంచుతున్నారని ఏమైన అంటే యుద్ధమని సాకు చెప్తున్నారు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం తీవ్రంగా విమర్శించారు. బుధవారం స్థానిక రైతుబజార్ వద్ద పేద కార్మికులను ఉద్దేశించి అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గ్యాస్ ధరలను 60 రూపాయలు పెంచింది అని పెద ప్రజలపై భారాన్ని మోపిందని ప్రభావం పడకముందే మనవద్ద నిత్యావసర వస్తువుల ధరలను పెంచడాన్ని అధికారులు స్పందించాలని ఇప్పటికే కొనలేని తినలేని పరిస్థితులలో ధరలు అకాశన్ని తాకుత్నునాయని సలాం అన్నారు. ప్రభుత్వం స్పందించి పేద వారి మీద భారం పడకుండా ధరలను నియంత్రించాలని ఒక ప్రక్క గిట్టుబాటు ధరలు లేవు అని రైతులు ఆందోళనకు గురి చేస్తోంది అని తెలిపారు. పంటలను సైతం ఏం చేయాలని అర్థం కావటం లేదని టమాట, అరటి పంటలను పొలాలకి వదిలి ఇబ్బంది పడుతుంటే మన వద్ద కి వచ్చే వరకు రిటెల్ మార్కెట్లో అరటిపండు 100 రూపాయలు, 170 మంచి నూనె "పలుకుతుందని తెలిపారు. ఇప్పటికి వారం రోజుల్లో తీవ్రంగా ధరలు పెంచారని అధికారులు వెంటనే స్పందించకపోతే, ప్రజల పరిస్థితి అయోమయంగా మారుతుందని తీవ్ర ఆవేదన వక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు యనాల సాంబశివరెడ్డి, నాయకులు చానా, జ్వాలా నర్సింహరావు, ఎస్.కె. సైదా, రాజు, శ్రీదేవి, లాలు తదితరులు పాల్గొన్నారు.

# రామాయణం పోటీ పరీక్షల విజేతలకు బహుమతులు ప్రధానం



మంథని, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) : విశ్వ హిందూపరిషత్ మంథని ప్రకండ ఆధ్వర్యంలో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం రామాయణం పోటీ పరీక్షలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. విశ్వహిందూపరిషత్ మంథని ప్రకండ బాధ్యులు రావుల సతీష్ మాట్లాడుతూ సోమవారం 5 పాఠశాలల నుండి మొత్తం 350 మంది విద్యార్థులకు రామాయణం పోటీలకు పరీక్షలు నిర్వహించి ప్రతి పాఠశాల నుండి 3 విభాగాలు గా విభజించి 55 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి పోటీ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశామన్నారు. మొదటి విభాగం నుండి (8,9,10) వ తరగతిలో మొదటి బహుమతి దుద్దిళ్ళ హాసిని (కాకతీయ హై స్కూల్), రెండవ బహుమతి నామిని సహర్షిణి (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.మంథని), మూడవ బహుమతి కుడుదుల హాసిని (కృష్ణవేణి టాలెంట్ స్కూల్) రెండవవిభాగం (6,7) తరగతిలో మొదటి బహుమతి గీట్ల శ్రీనిత్య రెడ్డి (కాకతీయ హైస్కూల్), రెండవ బహుమతి కన్ ధునూరి సాయి సాన్విత (కాకతీయ హైస్కూల్), మూడవ బహుమతి ఓల్లాల సాయి (అలోక్ పబ్లిక్ స్కూల్) అలాగే 3వ విభాగం (3.4.5.) తరగతిలో. మొదటి బహుమతి గీట్ల శ్రీవిద్య (కాకతీయ హైస్కూల్,) రెండవ బహుమతి మేకల వైష్ణవి (అలోక్ పబ్లిక్ స్కూల్), మూడవ బహుమతి మిరాల సోనిత్ (కృష్ణవేణి) కు చెందిన విద్యార్థులకు బహుమతుల అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా, మంథని ప్రకండ బాధ్యులు రావుల సతీష్, ప్రధాన కార్యదర్శి, వడ్ల కొండ శ్రావణ్, సత్సంగ ప్రముక కొమురవెల్లి హరీష్ గుప్తా, సహ కార్యదర్శి గుండా శ్రీనివాస్, ధర్మాజగరణ ప్రముక కనుకుంట్ల స్వామి, ఉపాధ్యక్షులు మేడగోని రాజమౌళి గౌడ్, ,ప్రచార ప్రముక తూర్పాటి రాము, శిశుమందిర్ కార్యదర్శి మాడిశెట్టి సురేందర్, కెక్కర్ల అనీల్ కుమార్, మాతృశక్తి సంయోజక రావికంటి రేణుక, సహ సంయోజక్ కొత్త పుష్పలత, ఉపాధ్యాయులు గీట్ల భరత్ రెడ్డి, మాధవి, లావణ్య రమాదేవి, రాజమల్లు, ఓదెలు పాల్గొన్నారు.

# చతిస్గడ్ రాష్ట్రంలో మావోయిస్టులకు పెద్ద దెబ్బ

44 మంది మహిళలతో సహా 108 మంది మావోయిస్టులు లొంగుబాటు

రూ.3.29 కోట్ల రివార్డు ప్రకటన

డంపు నుండి రూ.3.61 కోట్ల నగదు కిలో బంగారం

101 మారణాయుధాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



హైదరాబాద్ , (జర్నలిస్ట్ ఫైల్) : ( మాధవరావు యెగినాటి, నేటి శుభోదయ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కో ఆర్డినేటర్) మార్చి 31, 2026 కి ముందు దేశం నుండి మావోయిజా న్నీ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు పూర్తి అవ్వడానికి కేవలం 20 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇంతలో చత్తీస్గడ్ రాష్ట్రంలోని భస్తర్ డివిజన్లో భద్రతా దళాలు పెద్ద విజయాన్ని సాధించాయి. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీతో సంబంధం ఉన్న 108 మావోయిస్టులు హింస మార్గాన్ని లొంగిపోయారు. ఇది మావోయిస్టులకు ఆ సంస్థకు పెద్ద దెబ్బ. వారిలో 44 మంది మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. వారందరికీ రూ మూడు కోట్ల 29 లక్షల రూపాయలు రివార్డు ప్రకటించారు. భస్తర్ డివిజన్ ప్రధాన కార్యాలయం జగదల్పూర్ లోని శౌర్య భవన్ పోలీస్ కోఆర్డినేషన్ సెంటర్లో జరిగిన విలేకరుల సమావేశంలో డిజిపి అరుణ్ దేశ్ గౌతమ్ ఈ సమాచారాన్ని విలేకరులకు తెలిపారు. ఒరిస్సాలో రూ 16.5, మిలియన్లు, రివార్డుతో ఉన్న పదిమంది మావోయిస్టులు కూడా లొంగిపోయారు.

### 101 మారణాయుధాలు స్వాధీనం

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం లొంగిపోయిన మావోయిస్టులు, ఇతర నిఘా వర్గాల నుండి అందిన సమాచారం ఆధారంగా, భద్రత దళాలు వివిధ ప్రాంతాల్లో ఆపరేషన్ నిర్వహించాయి. వివిధ డంపుల నుండి ఏకే 47 లు, ఇన్సాస్ రైఫిల్స్, ఎల్ఎంజీలు, బి జి ఎల్ లాంచర్ల తో సహా 101 ప్రాణాంతక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది మావోయిస్టు వ్యతిరేక ప్రచారంలో పెద్ద విజయం గా పరిగణించబడుతుంది.

### రూ 3.61 కోట్ల నగదు, ఒక కిలో బంగారం కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఆపరేషన్లో భద్రతా దళాలు మావోయిస్టుల డంప్ నుండి పెద్ద మొత్తంలో నగదు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకే ప్రదేశం నుండి రూ 3 కోట్ల 61 లక్షలు, ఒక కిలో బంగారం స్వాధీనం చేసుకున్నారు.

### లొంగిపోయిన వారిలో పెద్ద క్యాడర్ గల మావోయిస్టులు ఆయుధాలు విడిచారు

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ చెందిన అనేకమంది సీనియర్ మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. వారిలో బస్తరు డివిజన్ కు చెందిన తెల్లం రాహుల్, కోవాస్ పాండు, ఓ యం జిత్రు, తూర్పు భస్తర్ కు చెందిన రామ్దర్ ఎలియాస్ బిరు, ఉత్తర బస్తర్ కు చెందిన మల్లేష్, పి ఎల్ జి ఏ నెంబర్ వన్ బెటాలియన్ కి చెందిన కమాండర్ ముచాకి, ఆంధ్ర - ఒరిస్సా బోర్డర్ కు చెందిన కమాండర్ కోస మండావి ఉన్నారు..

### 26 నెలల్లో 27 14 మంది మావోయిస్టుల లొంగుబాటు.

చత్తిస్గడ్ పోలీస్ అధికారుల కథనం ప్రకారం పునరావాసం ద్వారా పునర్జీవం పథకం ద్వారా సత్ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. ఈ పథకం కింద చత్తీస్గఢ్లో 2714 మంది మావోయిస్టులు 26 నెలలలో జనజీవన స్రవంతిలో కలిసినట్లు తెలిపారు.

### ఒడిశా రాష్ట్రంలో పదిమంది మావోయిస్టులు లొంగు బాటు

ఒడిస్సా రాష్ట్రంలోని కాంద మాల్ జిల్లా లో మావోయిస్టులకు ఎదురు దెబ్బ తగిలింది. ఇక్కడ రాష్ట్ర కమిటీ సభ్యులు సోను పోతం ఎలియాస్ నీతు తో సహా పదిమంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిపై పెద్ద మొత్తంలో రివార్డు ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ లొంగిపోయిన వారంతా గతంలో చత్తిస్గడ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో పనిచేసిన వారే నని పోలీసు అధికారులు తెలిపారు.



# జన గణన విధులను పక్కాగా నిర్వహించాలి

శిక్షణ తరగతుల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉద్బోధ




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) :

జన గణన విధులను పక్కాగా నిర్వహించాలని, అప్పుడే ఆయా వర్గాల ప్రజలకు భవిష్యత్తులో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు,అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం ఒక అవగాహనకు వచ్చి కార్యాచరణను అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.సెన్సెస్ 2027 ను పురస్కరించుకుని జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగస్వాములు అయ్యే తహసిల్దార్లకు,సంబంధిత శాఖల అధికారులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.ఈ నెల 13వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుండగా,హైదరాబాద్ నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పిస్తున్నారు.జనాభా గణన కోసం ఎలా సన్నద్ధం కావాలి,సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ....2011 లో చివరిసారి జనాభా గణన జరిగిందని గుర్తు చేశారు.వాస్తవానికి 2021 లో ఈ ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా,కరోనా తీవ్రత వల్ల నిర్వహించలేదని అన్నారు.ప్రస్తుతం సాంకేతికతను వినియోగిస్తూ,డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ జరిపేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.తొలి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల కట్టడాలు,కుటుంబ వివరాలను సేకరించడం జరుగుతుందని,రెండవ విడతలో వ్యక్తిగత వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు.దేశంలోనే తొలిసారి పూర్తిగా డిజిటల్ విధానం ద్వారా జన గణన జరపాల్సి ఉంటుందన్నారు.ఇప్పటికే గతేడాది నల్గొండ జిల్లా తిప్పర్తి,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలాల్లో ప్రయోగాత్మకంగా కుటుంబ,ఇళ్ళ వివరాల సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ గుర్తు చేశారు.జన గణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై వాస్తవ వివరాలు వెల్లడించాలని సూచించారు.ఏ ఒక్కరి వివరాలు సైతం ఎక్కడ కూడా బయటికి వెల్లడి కావని,నేరుగా సర్వర్ లో నిక్షిప్తం అయ్యేలా సాంకేతికతను వినియోగిస్తున్నారని అన్నారు.ఈసారి సెల్ఫ్ డిక్లరేషన్ ఎంతో ముఖ్యమని,అధికారులు,ఎన్యుమరేటర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు.చార్జ్ ఆఫీసర్లు ప్రతిరోజూ జన గణన ప్రక్రియను సమీక్షించాలని,తాము కూడా రోజువారీగా పర్యవేక్షణ జరుపుతామని అన్నారు.అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్దేశిత గడువు లోపు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను మెరుగైన రీతిలో పూర్తి చేసేలా సన్నద్ధం చేయాలన్నారు.ప్రణాళికల రూపకల్పన,అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జన గణన ప్రక్రియను నిబద్ధత,అంకితభావంతో నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బోధన్,ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో,అభిగ్యాన్ మాల్వియ,నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# 26న ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం లీగల్, (జర్నలిస్ట్ ఫైల్) : బార్ అసోసియేషన్ కు ఈ నెల 26 న జరుగబోయే ఎన్నికల నామినేషన్ గడువు బుధవారం తో ముగిసింది. ప్రెసిడెంట్ గా మోజెస్ క్రిస్టఫర్ జి , విజయ రాఘవ అయ్యదేవర, రమేష్ యడ్లపల్లి , వెంకటేశ్వర రావు గుప్తా సుగ్గల తమ నామినేషన్ ను దాఖలు చేసారు.వైస్ ప్రెసిడెంట్ గా జానిమియా షేక్,ప్రధాన కార్యదర్శి గా అమర్ నాథ్ కందుల , వెంకట నారాయణ తాళ్ళ , రవి కుమార్ కందుల, జాయింట్ సెక్రటరీ గా దొబ్బల శిరీష, క్రీడా మరియు సాంస్కృతిక కార్యదర్శి గా రామదాసు దారావత్, లైబ్రరీ సెక్రటరీ గా కళ్యాణి దేవరకొండ, ట్రెజరర్ గా రాజేశ్వరి వి కే డి, మహిళా న్యాయవాద ప్రతినిధి గా రాధమ్మ కనపర్తి తమ నామినేషన్ దాఖలు చేసారు. ఈనెల 12 న నామినేషన్ పత్రాల స్కృటినీ, మరియు 17 న విత్ డ్రా కు గడువు అని ఎన్నికల అధికారులు పి ఏ జే శేకర్ రాజ్, ఎం ఏ తౌఫిక్, మారగాని శ్రీనివాస్, పి వెంకన్న లు తెలిపారు.

# 166 సీనియర్ సిటిజన్ కేసుల పరిష్కారం...

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



మంథని/పెద్దపల్లి మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లాలో సీనియర్ సిటిజన్ల నుండి వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని వయో వృద్ధుల నుండి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత రెవెన్యూ ట్రిబ్యునల్‌ల ద్వారా పరిశీలించి పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి ఆర్‌డీఓ కార్యాలయంలో 130 కేసులు నమోదు కాగా వాటిలో 121 కేసులు పరిష్కరించగా 9 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, మంథని ఆర్‌డీఓ కార్యాలయంలో 28 కేసులు నమోదు కాగా వాటిలో 26 కేసులు పరిష్కరించగా 2 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, అలాగే అప్పీలేట్ కేసులు 19 నమోదు కాగా అన్ని 19 కేసులు పూర్తిగా పరిష్కరించబడినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 166 కేసులకు పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టం ప్రకారం వృద్ధుల ఫిర్యాదులను ట్రిబ్యునల్‌లో క్షుణ్ణంగా విచారించి, తల్లిదండ్రుల పోషణ బాధ్యత పూర్తిగా వారి పిల్లలదేనని స్పష్టం చేస్తూ అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను పాటించని పక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బుధవారం కొట్టె రాజయ్య, వా/శీ రాయమల్లు (96) గారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఎవరూ తనను పట్టించుకోవడం లేదని తెలియజేశారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ గారు కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. రాజయ్య గారి పేరుపై ఉన్న భూమిని వారికే అమ్ముకునే హక్కు ఉందని, ఆ భూమి ద్వారా వచ్చే డబ్బును రాజయ్య గారి పేరుపై బ్యాంకులో జమ చేసి భద్రపరచాలని ఆదేశించారు. అలాగే తల్లిదండ్రుల పోషణ మరియు సంరక్షణ పూర్తి బాధ్యత కుమారులదేనని, ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే చట్టరీత్యా శిక్షలు తప్పవని కుటుంబ సభ్యులకు హెచ్చరించారు.వయో వృద్ధులు తమ పిల్లలు సరైన విధంగా చూసుకోవడం లేదనే ఫిర్యాదులను ముందుగా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) వద్ద నమోదు చేయాలని, అక్కడ సమస్య పరిష్కారం కాని పక్షంలో జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. నేరుగా జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు నమోదు చేయకుండా ఈ విషయాన్ని వయో వృద్ధులు గమనించాలని తెలిపారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రుల ఎదుట నిలదీత

- జర్నలిస్టుల ఇండ్ల సమస్యను వెంటనే పరిష్కరించండి
- టీయూడబ్ల్యూజే టి జే ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి డిమాండ్



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : దశాబ్ద తరబడి అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను సత్వరమే పరిష్కరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లతో కూడిన జర్నలిస్టుల బృందం నిలదీశారు.ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో బుధవారం జరిగిన అధికారిక కార్యక్రమంలో ముగ్గురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి యు దబ్ల్యూ జె టీజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు జర్నలిస్టుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. దశాబ్దాలు తరబడి జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, అనేక దఫాలుగా వినతిపత్రాలు విజ్ఞప్తులు, చేస్తున్న తీవ్ర కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వైఖరి సరైంది కాదని, ఇప్పటికైనా జర్నలిస్టులకు తక్షణమే ఇళ్లస్థలాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రులు స్పందిస్తూ జర్నలిస్టుల సమస్యలపై సత్వరమే సమాలోచన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలు అంశంలో కూర్చొని చర్చించి సమస్యను పరిష్కరించుకుందామని మంత్రులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయు దబ్ల్యూ జే టి.జె.ఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు,ఎలక్ట్రాన్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్ , జిల్లా ఉపాధ్యక్షులు మందులు ఉపేందర్,ఎలక్ట్రాన్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, సాయి , ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, ఉపాధ్యక్షులు పానకాలరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్ రెడ్డి,వీడియో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, సుధాకర్, ఐజేయు నాయకులు గుండ్ల రాంబాబు, టీజేఎఫ్ నాయకులు మోహన్, తోట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల మహోత్సవ కార్యక్రమం

**– బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏగోలపు సదయ్య గౌడ్**



మంథని/పెద్దపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) : పెద్దపల్లి మండలం సబితం గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల మహోత్సవం సందర్భంగా ఈరోజు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల కార్యక్రమంలో పాల్గొని ఎల్లమ్మ తల్లిని దర్శించుకొని అమ్మవార్లకు ప్రత్యేక పూజ నిర్వహించి, అమ్మ వారి ఆశీస్సులు తీసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఏగోలపు సదయ్య గౌడ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి దీవెనలతో నియోజకవర్గంలోని ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో,సుఖ సంతోషాలతో,పాడి పంటలతో సువిశాలంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూనె రమేష్, మాజీ సర్పంచ్ సుంక సదయ్య గౌడ సంఘం అధ్యక్షుడు సుద్దాల సతీష్ గౌడ్,బుర్ర శ్రీనివాస్ గౌడ్,సుద్దాల కుమార్ గౌడ్,సతీష్ గౌడ్,పోడేటి రాజు గౌడ్,ముక్కెర శంకర్ గౌడ్,మేడగొని శివయ్య గౌడ్,శ్రావణ్ గౌడ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా పెడుతున్న చిరు వ్యాపారులను తొలగించాలని అధికారులకు వినతి ..



శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లో గల నానక్ రామ్ గూడ గ్రామంలోకి రావడానికి వీలు లేకుండా వీధి వ్యాపారస్తులు అనధికారికశీగా కాలనీ ఎంట్రన్స్ బ్లాక్ చేసి వాహనాల రాక పోకలకు ఆటంకం కలిగించడం జరుగుతుందని జె బి ఎం కాలనీ వాసులు సర్కిల్ అధికారులకు, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. మా కాలనీ లోపలికి వెళ్లే ఎంట్రన్స్ దగ్గరలో ప్రతిరోజు మరియు ప్రత్యేకంగా ప్రతి ఆదివారం.కొందరు కూరగాయల షాప్స్, హరే ఏక్ మాల్, పండ్ల దుకాణాలు, అనధికృత వాహనాలుపెట్టడం జరుగుతుందనీ, దీనివల్ల మాకు మా ఇళ్లల్లోకి వెళ్ళడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామనీ తెలిపారు. పలుమార్లు వాళ్లకు చెప్పగా వాళ్లు పట్టించుకోవడం లేదనీ. వాళ్లని ప్రశ్నిస్తే మా పైకి దాడి చేయడానికి తిరగబడుతున్నారనీ, ప్రతి వారము గొడవలు అవుతున్నాయనీ పేర్కొన్నారు. తమకు జిహెచ్ఎంసి నుంచి పర్మిషన్ ఉందనీ, మేము జిహెచ్ఎంసి వాళ్ళకు, మండల ఆఫీస్ వాళ్లకి ప్రతి వారం ఒక్కొక్క షాప్ చొప్పున కొంత అమౌంట్ చెల్లిస్తున్నామని మా పైకి గొడవకి దిగుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆదివారం జరిగే ఈ వారంతపు సంతలో ట్రాఫిక్ ను నియంత్రించాల్సిన బాధ్యత మీ ఉన్నదని నమ్ముతూ దయచేసి మీరు ఈ సమస్యని పరిశీలించి మా ఇబ్బందులు తొలగించాలని దేవరకొండ బాలకృష్ణ, రాజు, మహేందర్ వినతి పత్రం ద్వారా కోరినట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్ కొరత ఇబ్బందులలో హాస్టల్ నిర్వాహకులు..

**ప్రభుత్వ జోక్యం కోరిన ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్..**



శేరిలింగంపల్లి మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్ నగరంలో హాస్టళ్లకు కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో వేలాది హాస్టల్ నిర్వాహకులు, లక్షలాది మంది అతిథులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రాష్ట్ర ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ (టీఎస్ఐటి సిహెచ్ఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంపై అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాతా కరుణాకర్ మాట్లాడుతూ.. సమస్య తీవ్రతను వివరించారు. హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 11 వేల హాస్టళ్లు ఉండగా, వాటిలో దాదాపు 10 లక్షల మంది అతిథులు నివసిస్తున్నారని తెలిపారు. అయితే అంతర్జాతీయంగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల ప్రభావంతో కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోయిందని తెలిపారు . గ్యాస్ డీలర్లు ఇప్పటికే సుమారు 35 శాతం ధర పెంచినప్పటికీ, నిన్నటి నుంచి సరఫరాను పూర్తిగా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహణలో గ్యాస్ ప్రాణవాయువులాంటిదని, గ్యాస్ లేకపోవడం వల్ల వంటలు చేయడం అసాధ్యంగా మారిందని అన్నారు. ఒక సిలిండర్ ద్వారా రోజుకు సుమారు 309 మందికి మాత్రమే భోజనం తయారు చేయగలమని, ప్రస్తుతం సరఫరా లేకపోవడం వల్ల అల్పాహారం, భోజనాల ఏర్పాటులో తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. డీలర్లతో చర్చలు జరిపినా సమస్యకు సరైన పరిష్కారం దొరకలేదని, కనీసం నామమాత్రంగా అయినా గ్యాస్ సరఫరా చేయాలని కోరామని చెప్పారు. అవసరమైతే డొమెస్టిక్ గ్యాస్ ద్వారా అయినా హాస్టళ్లకు తాత్కాలికంగా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టళ్లను ప్రాధాన్యత రంగంగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొని సరిపడ గ్యాస్ అందించాలన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఏర్పడిన ఈ సమస్యను ప్రభుత్వము అత్యవసరంగా పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ట్రెజరర్ మహీధర్, నాయకులు జయరామిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మధు, సూర్య, ప్రతాప్ రెడ్డి, వర్మ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ రహిత సమాజం దిశగా హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రయోజనకరం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) భవిష్యత్ లో కేన్సర్ మహమ్మారి సోకకుండా ముందస్తుగా, కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అర్హులైన ఆడపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య పేర్కొన్నారు.స్థానిక 25వ, వార్డు పినపాడులోని అర్బన్ పి హెచ్ సి లా గురువారం ఏర్పాటు చేసిన హెచ్ పి వి వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమంలో 25వ, వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధానికి ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యగా, 15 ఏళ్లలోపు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతి పీహెచ్‌సీలోనూ ఈ కార్యక్రమం, మే నెల 31వ తేదీవరకు నిర్వహించనుంది. కార్యక్రమ ఉద్దేశాన్ని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్‌బాబు వివరించారు. మరో కౌన్సిలరు బోయపాటి అరుణ మాట్లాడుతు 14 ఏళ్లు పైబడిన, 15 ఏళ్లలోపు బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## త్రివేణి విద్యార్థులకు సి.వి.రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : సుచిర్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన సర్ సివి రామన్ యంగ్ జీనియస్ నేషనల్ ఒలంపియాడ్ టెస్ట్ లో స్థానిక త్రివేణి పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థిని విద్యార్థులకు ఈ యంగ్ జీనియస్ అవార్డును సొంతం చేసుకున్నారు. అందులో భాగంగా 10వ తరగతి విద్యార్థిని కే రిషిత జిల్లా ఫస్ట్ ర్యాంకును, 9వ తరగతికి చెందిన బి పూజ శ్రీ జిల్లా రెండో ర్యాంకును, 8వ తరగతి చెందిన ఎం నిహారిక జిల్లా సెకండ్ ర్యాంకును, ఏడవ తరగతి చెందిన ఎం కృష్ణ తేజ జిల్లా సెకండ్ ర్యాంకును, ఆరవ తరగతికి చెందిన యు .గౌతమ్ సిద్దార్థ జిల్లా ఫస్ట్ ర్యాంక్ ను కైవసం చేసుకున్నారు. తన పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు జిల్లా స్థాయి ర్యాంకులను కైవసం చేసుకోవడం ఎంతో గర్వంగా ఉందని పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి తెలియజేశారు. ర్యాంకు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో జాతీయస్థాయి ర్యాంకులు కూడా సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న ,ఐఐటీ ఇంచార్జ్ నయీమ్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అన్న మాట ప్రకారం, 15 రోజుల్లోనే

**– డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మలతో కలిసి వెలుగుమట్ల నిర్వాసితులకు పట్టాల పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి**

**– 'కబోదుల' పాలనలో పేదోడి ఘోష, 'ఇందిరమ్మ' రాజ్యంలో పట్టాల పండుగ**

**– కూల్చినోళ్లే నీతులు చెబుతారా విపక్ష నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు**

**– పగటి కలలు కనకండి, 'రెడ్ బుక్' రాసే నైతిక హక్కు మీకు ఎక్కడుంది అంటూ ఘాటు విమర్శలు**





ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : "రాజకీయం అంటే గద్దెనెక్కి దొరతనం చేయడం కాదు. పేదోడి కన్నీరు తుడవడం. ఈ నెల 1వ తేదీన ఇదే వేదిక మీద నుంచి హామీ ఇచ్చాను. 15 రోజుల్లోపు మీ సమస్య పరిష్కరిస్తానని. అన్న మాట ప్రకారం, ఇచ్చిన గడువు కంటే ముందే బాధితులుగా ఉన్న నా కుటుంబ సభ్యులను లబ్ధిదారులుగా చూడటం నాకెంతో గర్వంగా ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు." బుధవారం ఖమ్మం ఐడిఓసిలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన 311మంది వెలుగుమట్ల నిర్వాసితులకు ఇండ్ల పట్టాలు, మంజూరు పత్రాలను అందజేశారు.

### - కళ్లుండి చూడని కబోదులు

గత ప్రభుత్వ పదేళ్ల వైఫల్యాలపై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. "2017 నుంచి ఈ ఆడబిడ్డలు తాగడానికి నీళ్లు లేక, పాములు, జెర్రుల మధ్య నరకం అనుభవిస్తుంటే గత ప్రభుత్వానికి కళ్లు కనపడలేదా? కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరించారు. 2023లో ఇదే కాలనీని కూల్చేయడానికి ప్రయత్నించినప్పుడు పేదలు మిమ్మల్ని ప్రతిఘటిస్తే తోకముడుచుకుని వెళ్లిన మీరు, ఈరోజు పేదోడి గురించి అవాకులు చెవాకులు పేలుతారా మీకు ఆ నైతిక హక్కు ఎక్కడుంది" అని మండిపడ్డారు.

### - పగటి కలలు.. 'రెడ్ బుక్' హెచ్చరికలు

ప్రతిపక్ష నేత 'రెడ్ బుక్' రాస్తాననడంపై పొంగులేటి ఎద్దేవా చేస్తూ ఘాటుగా స్పందించారు. చీకటి పడకముందే ఎండలో పగటి కలలు కంటున్నారు. నేను ముఖ్యమంత్రిననో, కాబోయే ముఖ్యమంత్రిననో ఊహల్లో ఊగిసలాడకండి. మీ రెడ్ బుక్కులు రాసేదో.. మీరు వచ్చిన తర్వాత కక్షలు చూపించే కార్యక్రమమో.. అసలు అటువంటి అవకాశం తెలంగాణ ప్రజలు మీకు ఇవ్వరు. మీ పగటి కలలు కలలుగానే మిగిలిపోతాయి. మీ దొరల పోకడలు ఇక సాగవు" అని హెచ్చరించారు.

### - అర్హతే మా ప్రామాణికం

రాజకీయ కక్షసాధింపులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. చివరికి మా మీద దుమ్మెత్తి పోసిన వాళ్లయినా సరే, వారు నిజంగా అర్హులై ఉంటే చాలు, కడుపున పెట్టుకుని వారికి పట్టాలు ఇచ్చాం. ఇది పేదోడి దీవెనలతో వచ్చిన ప్రజా ప్రభుత్వం. 311 మందికి ఇక్కడే స్థలంతో పాటు ఇల్లు, ఇండ్ల స్థలాలు ఉన్న మరో 101 మందికి వారి వారి గ్రామాల్లోనే ఇందిరమ్మ మంజూరు పత్రాలు పంపామన్నారు. పేదోడి సొమ్ము దోచుకున్న కేటుగాళ్లు ఎంతటి వారైనా సరే.. ఉక్కుపాదంతో తొక్కి, ఆ సొమ్మును తిరిగి ఇప్పించాలని సీపీకి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

### - యుద్ధ ప్రాతిపదికన మోడల్ కాలనీ

కేవలం పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోమని, వారం రోజుల్లోనే తాగునీరు అందిస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీతో పాటు స్కూల్, ఫంక్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదపై వరాల జల్లు.. "ఇందిరమ్మ" ఇల్లు..

**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"..**

**లింగారెడ్డిగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేయించిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే శంకర్ కు మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు స్వాగతం మాజీ ఎమ్మెల్యే బక్కని, ఎమ్మెల్యే శంకర్ ల అన్యోన్యత లింగారెడ్డిగూడెం సర్పంచ్ ఎంసి రాజు, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల జగన్ ల కృతజ్ఞతలు రూ.30 లక్షలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**



షాద్నగర్ నియోజకవర్గం మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) : ఇందిరమ్మ ఇల్లు గూడు లేని నిరుపేదలకు వరాల జల్లు అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో బుధవారం గృహప్రవేశం అంగరంగ వైభవంగా చేయించారు. కార్యక్రమం కోసం లింగారెడ్డిగూడెం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రావడంతో గ్రామవాసి స్థానిక మాజీ ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ తన ఆప్యాయతను చాటారు. ఎమ్మెల్యే శంకర్ సైతం అంతే వినమ్రంగ ఆయనకు నమస్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ఇందిరమ్మ గృహ లబ్ధిదారు దంపతులకు నూతన వస్త్రాలు పెట్టి ఆశీస్సులు అందించారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదలను ఇంటి యజమానులను చేసే కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని దానిని అంకితభావంతో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటిని అందించి వారికి గూడు చూపించే కార్యక్రమం మంచి కార్యక్రమం అని అభినందించారు. సర్పంచ్ ఎంసీ రాజు, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ కార్యక్రమంలో హాజరైన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రగతి పనులకు శంకుస్థాపన..


అదేవిధంగా గ్రామంలో 30 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, దీపిక, వీరేష్ గౌడ్, మమత, అరుణ్, సాయికుమార్, బాలమణి, యాదయ్య, మాధవి, గణేష్, మెహరాజ్, శశాంక్, గ్రామ పెద్దలు కందూరి అంజయ్య గౌడ్, రంగంపల్లి రమేష్, భాస్కర్ రెడ్డి, పంతులు, లక్ష్మయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, సుధాకర్, ధనాల రాజు యాదవ్, ధనుంజయ గౌడ్, పక్కని శీను, యాదయ్య గౌడ్, మంగలి మల్లేష్, శంకరయ్య, అంజయ్య ప్రతాపరెడ్డి, దాదేమియా, జంగయ్య, నారాయణ, శీను, శేఖర్, యాదగిరి, ఖదీర్ ,యాదయ్య తదితరులు పాల్గొన్నారు..

## సిద్దులూరులో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో డిజిటల్ చెల్లింపుల అవగాహన సదస్సు

నేటి శుభోదయ వికారాబాద్ 11మార్చి :వికారాబాద్ మండలంలోని సిద్ధలూరు గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో డిజిటల్ చెల్లింపుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ మేనేజర్ విజయ్ సునీల్ హాజరై ఖాతాదారులకు డిజిటల్ లావాదేవీల ప్రాముఖ్యత మరియు భద్రతపై అవగాహన కల్పించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవం (మార్చి 9 నుండి 15, 2026 వరకు) ఈ కార్యక్రమం నిర్వహిస్తారు ఈ ఏడాది థీమ్ "సురక్షిత డిజిటల్ చెల్లింపులు" కాగా, "తోడా ధ్యాన్ సే జాగ్రత్తగా ఉండండి" అనే సందేశంతో ప్రజలకు జాగ్రత్తలు వివరించారు. డబ్బు స్వీకరించడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోకూడదని, నకిలీ ఆఫర్లు లేదా సందేశాలకు మోసపోవద్దని సూచించారు. అలాగే చెల్లింపు చేసే ముందు మొత్తం మరియు లబ్ధిదారుడి పేరును తప్పనిసరిగా తనిఖీ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవేందర్, ఫీల్డ్ ఆఫీసర్ శంకర్, వీవోఏ జంగయ్య, గ్రామ పెద్దలు, మహిళలు మరియు ఖాతాదారులు పాల్గొన్నారు.



## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) : టిఎన్జీవో ఆధ్వర్యంలో.... టీఎన్జీవో సమావేశ మందిరంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్,టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు,ఇఫ్తార్ విందు నిర్వహించడం జరిగింది.మహిళా దినోత్సవ కార్యక్రమానికి రూరల్ శాసనసభ్యులు రేకులపల్లి భూపతి రెడ్డి,నగర మేయర్ కూరగాయల ఉమారాణిరమేశ్,ఏఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై,అనంతరం ముఖ్య అతిథులు



భూపతి రెడ్డి మాట్లాడుతూ.... టీఎన్జీవో ఆధ్వర్యంలో అట్టహాసంగా ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించిన టిఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులను అభినందిస్తూ.... ఇట్టి కార్యక్రమానికి విచ్చేసిన మహిళా ఉద్యోగ సోదరీమణులందరికీ హృదయపూర్వక అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ,మహిళ సాధికారత కొరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని,ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బకాయిలు,టీఎన్జీవో కళ్యాణమండపం కొరకు నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి మహమ్మదీయ మత పెద్దలు విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి,అనంతరం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ప్రత్యేక నమాజులు నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు .రెండు కార్యక్రమాలకు టీఎన్జీవో మహిళ విభాగం సభ్యులు కేపీ సునీత,ఇందిర, విజయలక్ష్మి, గీతారెడ్డి, మంగమ్మ,శ్రీవేణి,టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గైని గంగారం,రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చుకూరి సతీష్,జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, చిట్టి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు అతిక్ అహ్మద్,జాఫర్ హుస్సేన్, శివకుమార్, మాణిక్యం,పురుషోత్తం,జిల్లా కార్యవర్గ సభ్యులు గంగరాజు,ప్రకాష్,నిరంజన్ గౌడ్,గురు చరణ్,లక్ష్మి నారాయణ, భూమయ్య,సునీల్, స్వామి, రవి, అన్ని యూనిట్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, శశికాంత్ రెడ్డి, విశాల్,ప్రవీణ్,సృజన్ కుమార్, సాయిలు,సూర్య ప్రకాష్, టీఎన్జీవో ముఖ్య సలహాదారులు వనమాల సుధాకర్, క్లాస్ ఫోర్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్,సర్దార్ వీరేందర్ సింగ్,వివిధ శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు,అన్ని శాఖల మహిళా ఉద్యోగ సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కుమ్మరిగూడలో ఆంజనేయస్వామి, నవగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

**కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ కు ఆహ్వాన పత్రిక అందజేసిన కుమ్మరిగూడ గ్రామస్తులు**



షాద్నగర్ నియోజకవర్గం మార్చి 12 (జర్నలిస్ట్ ఫైల్) : కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడెంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈనెల 13 తేదీ మహా గణపతి పూజతో మొదలై 15వ తేదీ మహాగణపతి, ఆంజనేయస్వామి,నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జండగూడెం సుదర్శన్ గౌడ్ కు కుమ్మరిగూడ కౌన్సిలర్ మాధవి గోపాల్ గౌడ్, వెంకటేష్,శ్రీశైలం,గ్రామస్తులతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కమ్మరి జనార్దన్ చారి,రవి నాయక్,చిలకమర్రి నరసింహ,చింత సాయి తేజశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## 48 డివిజన్లో తోటరామారావు గోవిందమ్మ ఆధ్వర్యంలో ముస్లిం సోదరీ సోదరీమణులకు ఇఫ్తార్ విందు



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక 48వ డివిజన్లో తోట రామారావు, గోవిందమ్మ రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా కోట గోవిందమ్మ, రామారావు మాట్లాడుతూ ముస్లిం లు అతి పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 30 రోజుల కఠోర ఉపవాస దీక్షలు చేయటం చాలా గొప్ప అని వారికి అల్లా యొక్క దీవెనలు ఎప్పుడూ ఉండాలని మన దేశంలో కుల మతాలకతీతంగా అందరం కూడా ప్రతి పండగలను కలిసి చేసుకోవడం భారత సాంస్కృతి ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు డివిజన్ నాయకులు పాల్గొని ముస్లిం సోదరులతో నమాజు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు సుబూర్, డివిజన్ నాయకులు వంగల వెంకట్, చేతికి కృష్ణ, కిషన్ నాయక్, బాబా, ఖాదర్, అబ్దుల్, షమ్మీ ,అజ్జు లు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ ఆర్థిక అక్రమాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన 192 వార్డ్ సచివాలయం వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ ఎ.పవన్ కుమార్ ను సస్పెండ్ చేశామని నగర కమిషనర్ కె.మయూర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పవన్ కుమార్ సచివాలయం పరిధిలో ఆస్తి పన్ను, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్, ఎల్ఆర్ఎస్ ఛార్జీల పేరుతో ప్రజల నుండి భారీ మొత్తంలో నగదు వసూలు చేసి, ఆ సొమ్మును కార్పొరేషన్ ఖాతాలో జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. అంతేకాకుండా, తక్కువ మొత్తానికి నకిలీ రశీదులు సృష్టించి ప్రజలను మరియు ప్రభుత్వాన్ని మోసగించినట్లు నిర్ధారణ కావడంతో, ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (జజూా) రూల్స్, 1991 ప్రకారం తక్షణమే సస్పెన్షన్ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. పవన్ కుమార్ పై పోలీసు కేసు కూడా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం లేదా విధి నిర్వహణలో అవినీతికి పాల్పడటం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై మరింత కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ పన్నులు మరియు ఇతర మున్సిపల్ రుసుములను చెల్లించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పౌరులు తమ చెల్లింపులను నేరుగా నిర్దేశించిన జీఎంసి క్యాష్ కౌంటర్లలో లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించి, కంప్యూటర్ జనరేటెడ్ రశీదును తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఎవరైనా వ్యక్తిగతంగా నగదు అడిగితే నమ్మవద్దని, పారదర్శకమైన సేవల కోసం అధికారిక మార్గాలనే ఎంచుకోవాలని ప్రజలకు సూచించారు.

## జడ్పీ హైస్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్ట



**చాపాడు (జర్నలిస్ట్ ఫైల్ )** చాపాడు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌ను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. పాఠశాలలో సుమారు ?2 కోట్ల 40 లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. వీటిని ఎమ్మెల్యే ఇవాళ ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తమ లక్ష్యాలను సాధించడానికి క్రమశిక్షణతో ముందుకు సాగాలని ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. పాఠశాల స్థాపనకు భూమి దానం చేసిన భూదాతను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు పాఠశాల యాజమాన్యం స్కూల్ అభివృద్ధి కొరకు తమ తోడ్పాటు అందించమని ఎమ్మెల్యే ని కోరగా వెంటనే స్పందించి పాఠశాల అభివృద్ధి కోసం త్వరలోనే మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ఆట స్థలం అభివృద్ధి స్టేజ్ ప్లాట్‌ఫారం నిర్మాణం మరియు పాఠశాల ప్రాంగణంలో మొక్కల నాటడం వంటి పనులను చేపడతామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టైలరింగ్, కంప్యూటర్ ట్యాలి, బ్యూటీ పార్లర్ కోర్స్‌ల్లో ఉచిత శిక్షణ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** టైలరింగ్, కంప్యూటర్ ట్యాలి, బ్యూటీ పార్లర్ కోర్స్ ల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు యూనియన్ గామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ టి.సందీప్ బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టైలరింగ్ కోర్సును ఏప్రిల్ 2వ తేదీన, కంప్యూటర్ ట్యాలి కోర్సును ఏప్రిల్ 6వ తేదీన, బ్యూటీ పార్లర్ కోర్సును ఏప్రిల్ 20వ తేదీన ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని వివరించారు. ఈ శిక్షణకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. కంప్యూటర్ ట్యాలీలో కోర్సును పురుషులు కూడా అర్హులేనని చెప్పారు. ఉచిత శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయం, ఉచిత హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని అన్నారు.

19 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా తమ వివరాలను గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్, డోర్ నెంబరు 14-1-14 చిరునామాలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు కాపీ, ఆధార్ కార్డు కాపీ, నాలుగు పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలు, 10వ తరగతి సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. వివరాలకు 08632336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని వివరించారు.

## బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఎన్డీయే కూటమి

- అరండల్‌పేటలో మూడు అంతస్తుల రజక భవన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ బీసీ వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం బీసీలకు మరింత చేయూతనిస్తూ వారి అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. గురువారం గుంటూరు నగరంలోని 52వ డివిజన్ అరండల్‌పేట 12/2 లైన్‌లో నిర్మించిన రజక భవనాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రజక సంఘ నాయకులు, కమ్యూనిటీ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...రజకుల సమాజం ఎన్నో సంవత్సరాలుగా కోరుకుంటున్న రజక భవన్ ప్రారంభించుకోవటం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ రజక భవన్ లో అనేక కార్యక్రమాలు నిర్వహించుకునేలా, కమ్యూనిటీకి ఒక కేంద్రంగా ఉండేలా ఈ భవనం అందుబాటులోకి రావడం రజక సమాజానికి ఒక మంచి పరిణామమన్నారు. గత ఐదేళ్లలో ఈ భవనం ప్రారంభానికి ఎలాంటి పురోగతి లేకపోయినప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రజకుల ఆకాంక్ష నెరవేరి ఈ భవనం ప్రారంభం కావడం ఆనందదాయకమని, ఈ భవనం నిర్మాణానికి సాంబశివరావు, కోటేశ్వరరావు తమ సొంత నిధులతో ముందుండి నిర్మాణం పూర్తి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మూడు అంతస్తులతో నిర్మించిన ఈ రజక భవన్ రజకుల సమాజానికి సంబంధించిన సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, ఇతర కార్యకలాపాలకు ఎంతో ఉపయోగపడే విధంగా రూపొందించబడిందని, అదేవిధంగా పలువురు రజక నాయకులు, శ్రేయోభిలాషులు కూడా ఈ కార్యక్రమానికి సహకారం అందించి భవనం నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశంసించారు. నరసరావుపేట సహా పలు ప్రాంతాల నుంచి కమ్యూనిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమని అన్నారు. తనను రజక సమాజం తమ ఆడపడుచుగా భావించి ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం తనకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ భవనాన్ని ప్రారంభించడం తనకు కూడా ఒక ప్రత్యేకమైన అనుభూతి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## ఘనంగా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ క్రీడలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది క్రీడలు గుంటూరు పెరేడ్ గ్రౌండ్ లో గురువారం ఘనంగా జరిగింది. డిప్యూటీ కమీషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డా. కె. శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 50 మీటర్లు, వంద మీటర్లు, నాలుగు వందల మీటర్ల పరుగు పందేలు, వాలి బాల్, షాట్ పుట్, లాంగ్ జంప్, టెన్ని కోయిట్, ట్రిపుల్ జంప్, చెస్ తదితర విభాగాల్లో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించారు. శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ కమీషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తుందని చెప్పారు. నిత్యం విధులు నిర్వహణలో ఉండటం జరుగుతోందని, ఇటువంటి క్రీడలు మానసిక, శారీరక ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉద్యోగులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండాలని తద్వారా విధులు సమర్థవంతంగా నిర్వహించగలరని చెప్పారు. క్రీడల్లో పాల్గొనాలని, యోగా చేస్తూ ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. రోజులో కనీసం ఒక గంట పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. విధులు ఎంత ముఖ్యమో కుటుంబం అంత ముఖ్యమని, కుటుంబానికి కూడా కొంత సమయం కేటాయించాలని, పిల్లల చదువు, భవిష్యత్తు పట్ల కొంత దృష్టి సారించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు అడిషనల్ యస్. పి ఎ ఆర్ డి. హనుమంతు, గుంటూరు జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి అరుణ కుమారి, రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నరసింహ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కామేశ్వరరావు, కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రమణ, ఉమ్మడి గుంటూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యశోదర దేవి, ఉమ్మడి గుంటూరు జిల్లా కానిస్టేబుల్స్ అండ్ హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షులు కోటయ్య, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బంగారు నగల షాపులో వెండి, బంగారం చోరీ

- షాపులో 10, కేజిలవెండి 10గ్రాముల బంగారం చోరీ : సిఐ రాములనాయక్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**

బంగారు నగల షాపు తాళాలు పగుల గొట్టి , బంగారం, వెండి చోరీ చేసిన ఉదంతం మార్వాడి గుడి ఎదురు వీధిలోని బంగారు నగల షాపులో వెలుగు చూసింది.

టుటౌన్ పోలీస్టేషన్ లిమిట్స్ లోని గంగానమ్మపేట మార్వాడి గుడి ఎదురు వీధిలోని,శ్రీ సాయి బాలాజీ జ్యువెలర్స్ లో, బుధవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళాలను ఇనుప రాడ్డుతో ధ్వంసం చేసి షాపులోకి ప్రవేశించిన దుండగులు,10 కేజీల వెండి, 10 గ్రాముల బంగారం అపహరించుకు వెళ్ళినట్లు సమాచారం. రాత్రి వేళ గస్తీ నిర్వహించే గుర్ఖా అర్ధరాత్రి దాటాక 2.30 నిమిషాల సమయంలో షాపు తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి, యజమాని రామారావుకు సమాచారం ఇచ్చాడు. వెంటనే టూ టౌన్ పోలీసులకు తెలియజేశారు. సీఐ రాములు నాయక్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలు పరిశీలించగా అర్ధరాత్రి ఒంటి గంట నుండి 2 గంటల మధ్య ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. చోరీ చేసిన సొత్తును బ్యాగుల్లో పెట్టుకొని వెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డ్ అయ్యాయి. గురువారం ఉదయం గుంటూరు నుంచి క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించాయి. చోరికి గురైన సొత్తు విలువ సుమారు రూ. 30 లక్షల వరకు ఉంటుందని, షాపు యజమాని రామారావు తెలిపారు. బంగారం వెండి షాపులు అధికంగా ఉండే ఆ ప్రాంతంలో భారీ చోరీ జరగడంతో, ఆ ప్రాంతంలో వ్యాపారుల్లో కలకలం ఏర్పడింది.

సీఐ రాములు నాయక్ మాట్లాడుతూ అర్ధరాత్రి సమయంలో వెండి,బంగారం,చోరీ జరిగినట్టు వచ్చిన పిర్యాదు మేరకు ప్రాథమిక దర్యాప్తు చేపట్టామన్నారు.సీసీ కెమెరాలలో ఇద్దరు యువకులు చోరీ చేసినట్టు తెలుస్తుందని,ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి దర్యాప్తు వేగవంతం చేసి,త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు, బంగారం నగల వ్యాపారుల సంఘం పటిష్టమైన భద్రత, సిసి, కెమెరాలు, అలారాలు వంటి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం,ఎంతైనా ఉందనే భావన వ్యాపారుల్లో వ్యక్తమవుతుంది.

## నేడు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** కవయిత్రి ఆతుకూరి (మొల్ల) మొల్లమాంబ జయంతి వేడుకలను నేడు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యములో ఉదయం 10 గంటల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, బి.సి. సంఘాల నాయకులు తదితరులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## రాష్ట్రానికి పట్టిన దరిద్రం వైసీపీ



- జగన్ నీచపు అలోచనలతో రాష్ట్రం సర్వ నాశనం
- రాజధానితో మూడు ముక్కలాడారు
- బిల్లులన్నీ ఆపేసి విద్య, వైద్యాన్ని అటకెక్కించారు
- కూటమి పాలనలోనే రాష్ట్రం సుభిక్షం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- 40 మందికి రూ.53 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రానికి పట్టిన దరిద్రం వైసీపీ అని, జగన్ నీచపు ఆలోచనలతో సొంత కుటుంబాన్ని సైతం దూరం చేసుకున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. గురువారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో 40 మంది లబ్ధిదారులకు 53 లక్షల విలువైన సీఎంఆర్ ఎమ్మెల్యే నసీర్ పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ ముఖ్యమంత్రి సహాయనిధి అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే నసీర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ జగన్ వంటి నాయకులను ప్రజాక్షేత్రం నుంచి తరిమికొట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తోన్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ నిధులను కూడా నిలిపేసి పేదలకు వైద్యం అందకుండా చేసిన దుర్మార్గపు చరిత్ర జగన్ ది అని దుయ్యబట్టారు. కూటమి పాలనలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నియామకం, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలు కేవలం 18 నెలల్లోనే పూర్తి చేశామని చెప్పారు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మూడు ముక్కలాటతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్ విధ్వంసానికి మారుపేరుగా నిలిచారని విమర్శించారు. వైద్య బిల్లులతోపాటు విద్య రంగానికి సంబంధించిన బిల్లులను సైతం నిలిపివేసి అన్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు జాకీ వంటి కంపెనీలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని, వైసీపీ పాలనలో దౌర్భాగ్య పరిస్థితులను దాటుకుంటూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టిన ఘనత సీఎం నారా చంద్రబాబు నాయుడుదేనని స్పష్టం చేశారు.. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా సుభిక్ష పాలన సాగుతుందని పేర్కొన్నారు.

## రోస్టర్ లోపాలు సరిచేసి ఎస్సీ వర్గీకరణ చట్టం రూపొందించాలి




- పిటిషనర్ చిలువూరి నాగరాజు మాదిగ డిమాండ్

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా రోస్టర్ విధానంలో ఉన్న లోపాలను సరిచేసి అన్ని ఉపకులాలకు న్యాయం జరిగేలా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది చిలువూరి నాగరాజు మాదిగ డిమాండ్ చేశారు. గురువారం మంగళగిరి ప్రెస్ క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాదిగ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన వర్గీకరణ చట్టంలో గ్రూపుల విభజనలో జనాభా నిష్పత్తి, రోస్టర్ విధానంలో లోపాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ లోపాలను సరిచేయాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు అడ్వకేట్ నర్రా శ్రీనివాసరావు పిటిషనర్ చిలుకూరి నాగరాజు మాదిగ తరపున దాఖలు చేయగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణకు స్వీకరించినట్లు తెలిపారు.


గ్రూపుల విభజనలో జనాభా నిష్పత్తి పాటించలేదని, ఉపకులాల కేటాయింపులో అసమానతలు ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. రోస్టర్ విధానం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉండి ఎస్సీల్లో అభివృద్ధి చెందిన మాల సామాజిక వర్గానికి లాభం చేకూరేలా ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం లోపాలను సరిచేసి అన్ని ఉపకులాలకు న్యాయం జరిగే విధంగా చట్టాన్ని రూపొందించాలని నాగరాజు మాదిగ కోరారు. ఈ కార్యక్రమంలో ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, మానికొండ శ్రీధర్ మాదిగ, ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ, ఉన్నం ధర్మారావు మాదిగ, కొమరాల శ్రీనివాసరావు మాదిగ, పులి దాస్ మాదిగ, కట్టేపోగు బాబురావు మాదిగ, ఈపూరి అదం మాదిగ, కోడూరి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాత గోవిందమాంబ ఆరాధన గురుపూజ మహోత్సవం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ )**కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ధర్మపత్ని మాత గోవిందమాంబ ఆరాధన గురుపూజ మహోత్సవములు మఠాధిపతులు శ్రీ-శ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములవారీ ఆదేశాల మేరకు మఠం ఆలయ ప్రాంగణంలో జరుగునని మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు ప్రాతః కాలం నుండి సుప్రభాత సేవ పంచామృతాభిషేకం సహస్రనామార్చన మధ్యాహ్నం ద్వారా పూజ మరియు రాత్రి గ్రామోత్సవం నిర్వహించునని కావున భక్తాదులందరూ ఈ ఆరాధన మహోత్సవంలో తీర్థ ప్రసాదాల స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు తెలిపారు

## ఎయిర్ ఫోర్స్ లో చేరండి...అద్భుత భవిష్యత్తుకు పునాది వేయండి

- 15న తెలంగాణ రాష్ట్ర పురుష అభ్యర్థులకు
- ఉదయం 4 గంటల నుండి ప్రాంగణంలో ప్రవేశానికి అనుమతి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగంలో నిర్వహిస్తున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి అనూహ్య స్పందన లభించిందని సెంట్రల్ ఎయిర్ మెన్ సెలెక్షన్ బోర్డు ప్రెసిడెంట్ (న్యూఢిల్లీ) గ్రూప్ కెప్టెన్ నవీన్ కుమార్ చబ్బా అన్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరండి, అద్భుతమైన భవిష్యత్తుకు పునాది వేయండి అని యువతకు పిలుపునిచ్చారు. నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సి.ఎ.ఎస్.బి ప్రెసిడెంట్ అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ వివరాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళ, పురుష యువతకు ఇది ఒక గొప్ప అవకాశం అన్నారు. ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీకి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, విశ్వవిద్యాలయం, పోలీస్ శాఖ మంచి సహాయ సహకారాలు అందించిందని అన్నారు.

హైదరాబాద్ ఎయిర్ ఫోర్స్ రిక్రూటింగ్ అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళ, పురుష అభ్యర్థులకు నిర్దేశించిన వాయు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అభ్యర్థులకు ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీ అవకాశం కల్పించడం జరిగిందని చెప్పారు.

నేరుగా ఓపెన్ రిక్రూట్మెంట్ ర్యాలీలో అర్హతగల అభ్యర్థులు పాల్గొనవచ్చున్నారు.

**7 వేల మంది ఆంధ్ర ప్రదేశ్ పురుష అభ్యర్థులు హాజరు**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పురుష అభ్యర్థులకు మార్చి 12న నిర్వహించిన ఓపెన్ ర్యాలీకి ఏడు వేల మంది హాజరు అయ్యారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మహిళా అభ్యర్థులు వెయ్యి మంది హాజరు అ-య్యారని వివరించారు. పురుష అభ్యర్థులు 11వ తేదీ రాత్రి నుండే రావడం ప్రారంభించారని, అన్ని ఏర్పాట్లు చేసామని వివరించారు.

తెలంగాణ పురుష అభ్యర్థులకు మార్చి 15న ఓపెన్ ర్యాలీ జరుగుతుందన్నారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎంపిక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 2005 జూలై 2 నుండి 2009 జనవరి 2వ తేదీ మధ్య జన్మించిన అవివాహిత పురుష అభ్యర్థులు అర్హులన్నారు. కనీస ఎత్తు 152 సెం.మీ. (స్త్రీ మరియు పురుషులు), ఇంటర్మీడియట్ (10౦2) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత లేదా 3 సంవత్సరాల డిప్లొమా ఇంజనీరింగ్ లేదా 2 సంవత్సరాల ఒకేషనల్ కోర్సు ఉత్తీర్ణత కలిగిన విద్యార్హత ఉండాలన్నారు. మొత్తం మార్కుల్లో 50 శాతం మరియు ఇంగ్లీషులో 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

1.6 కిలో మీటర్ల పరుగు పోటీ, భౌతిక, శారీరక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందని చెప్పారు. రాత పరీక్షకు ప్రశ్న పత్రం ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉంటుందని, ఒక తప్పు జవాబుకు పావు మార్కు తీసివేయడం జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, నేరుగా ర్యాలీ కీ హాజరు కావచ్చని తెలిపారు. ఒరిజినల్ లేదా డిజీలాకర్ ద్వారా ధృవపరిచిన విద్యార్హత సర్టిఫికేట్లు (టెన్త్, ఇంటర్ పాసైన సర్టిఫికేట్లు లేదా తత్సమాన విద్యార్హత సర్టిఫికేట్లు), నివాస ధృవీకరణ (డొమిసైల్ సర్టిఫికేట్), ఎన్.సి.సి సర్టిఫికెట్ (ఒక వేళ ఉంటే), ఆధార్ కార్డ్, ఈ-మెయిల్ ఐడి, మొబైల్ నంబర్, ఇటీవలి తీసుకున్న 10 కాపీలు పాస్ పోర్ట్ సైజు కలర్ ఫోటోలు, ప్రతి సర్టిఫికెట్ కు సంబంధించిన 6 జిరాక్స్ కాపీలు తీసుకురావాలని వివరించారు.

తెలంగాణ పురుష అభ్యర్థులు మార్చి 15వ తేదీ ఉదయం 6 గంటల నుండి10 గంటలు వరకు నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో హాజరు కావాలని కోరారు. ఉదయం 4 గంటలకు వచ్చినా అనుమతి ఉంటుందని, ఉదయం 10 గంటల తర్వాత ప్రవేశానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆర్.టి.సి బస్సులను విజయవాడ, గుంటూరుల నుండి నడుపుతోందని ఆయన చెప్పారు. అభ్యర్థులు అభ్యర్థులు మధ్యవర్తులను నమ్మి మోసపోరాదని కోరారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## శభాష్ దుర్గేష్...అమరావతిలో 'క్రియేటివ్ సిటీ' ఏర్పాటుకు ముందడుగు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వెలగపూడి సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పనితీరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ముంబయి పర్యటనలో రాష్ట్ర పర్యాటక రంగ ప్రగతి కోసం మంత్రి కందుల దుర్గేష్ చూపిన చొరవను కొనియాడుతూ, "శభాష్ దుర్గేష్.. వెల్ డన్, కీప్ ఇట్ అప్" అంటూ ప్రశంసలు కురిపించారు.

వివరాల్లోకి వెళ్తే ముంబైలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో పాల్గొన్న విశేషాలను మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి కల్పించిన పారిశ్రామిక హోదా, నూతన పర్యాటక పాలసీ 2024-29, ఇన్వెస్టర్లకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు సమగ్రంగా వివరించానని తెలిపారు. ఈ క్రమంలో ప్రముఖ సంస్థ 'మెసెర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్' ప్రతినిధులు ఏపీ పర్యాటక రంగ పురోగతి పట్ల ఆకర్షితులై విశాఖపట్నంలో రూ. 100 కోట్లతో అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేసేందుకు అప్పటికప్పుడు అక్కడే ఎంఓయూ కుదుర్చుకున్నారని మంత్రి దుర్గేష్ తెలిపారు. సినిమా రంగం మరియు స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై 'యూరోస్' సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపానన్నారు. ఈ సంస్థ ప్రతినిధులు త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇప్పటికే ఒక పర్యాయం వీరితో సీఎం చంద్రబాబు నాయుడు చర్చించినట్లు గుర్తు చేశారు.

**అమరావతి - గ్లోబల్ హబ్:** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. భవిష్యత్తు అంతా 'క్రియేటివ్ ఎకానమీ'దేనని స్పష్టం చేశారు. ఈ దిశగా అమరావతిలో ఒక భారీ 'క్రియేటివ్ సిటీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇది ఏఐ ఫిల్మ్ ఇండస్ట్రీ, యూట్యూబ్, ఎలక్ట్రానిక్ మరియు డిజిటల్ కంటెంట్ సృష్టికి వేదికగా ఉంటుందన్నారు. అమరావతిని గ్లోబల్ క్రియేటివ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురోగతి కోసం నిరంతరం కృషి చేయాలని, పర్యాటక మరియు సాంస్కృతిక రంగాల్లో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని మంత్రి దుర్గేష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

## చీఫ్ విప్ జీవీకి ఎ-గ్రేడ్



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** వినుకొండ శాసన సభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు ఎ-గ్రేడ్ దక్కింది. రాష్ట్రంలోని శాసన సభ్యుల పనితీరు ఆధారంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే చేయించి, వచ్చిన నివేదికల ఆధారంగా గ్రేడ్లు ఇస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నారు.

పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముందు వరుసలో నిలిచి ఎ- గ్రేడ్ సాధించటం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుండి ప్రశంశలు అందుకున్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వినుకొండను అభివృద్ధి చేయాలని తపిస్తున్న జీవీ ఆంజనేయులుకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వినుకొండ పర్యటనకు రావటం, వెటర్నరీ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించటం మరింత ఊరటనిచ్చింది.

ఇవేకాక ఇప్పటికే నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేసేదిశగా చంద్రబాబు నాయుడు భరోసా నివ్వటంతోపాటు, వినుకొండ పట్టణంలో 21 ఎకరాల స్థలాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, వినుకొండకే తలమానికంగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ. 50కోట్ల నుండి 100 కోట్ల వరకు నిధులు ఇచ్చేందుకు చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో 100 పేద కుటుంబాలను పీ4 ద్వారా దత్తత తీసుకున్న జీవీ ఆంజనేయులు దంపతులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజాదర్బార్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జీవీ ఆంజనేయులు నియోజకవర్గ ప్రజలకు మరింత అందుబాటులో ఉంటూ, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవీకి ఎ-గ్రేడ్ దక్కటంపై కేడర్లో ఉత్సాహం రెట్టింపైంది.

## కావూరి సాంబశివరావుకు బీజేపీ ఘన నివాళి



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మృతి పట్ల బీజేపీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు హైదరాబాద్‌లోని సాంబశివరావు నివాసానికి వెళ్లి ఆయనకు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని దేవుణ్ణి ప్రార్థించారు. అనంతరం మీడియాతో పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ కావూరి సాంబశివరావు సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజా సేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని అన్నారు. ఆయన మరణం రాజకీయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఏలూరు, మచిలీపట్నం నియోజకవర్గాల నుంచి ఐదు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికై ఆ ప్రాంతాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని మాధవ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన నిబద్ధత ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు.

# పీపుల్స్ ఫ్రెండ్లీగా అటవీ శాఖ పనితీరు మారాలి

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పెద్ద ఎత్తున ఆవిష్కరణలు రావాలి
- ఏఐ సాయంతో వైద్య ఖర్చులు తగ్గించేలా చర్యలు
- వేసవిలో వడగాలుల మరణాలు ఉండకూడదు
- 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వంలోని అన్ని విభాగాలు ప్రజా కోణంలోనే ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, జరుగుతోన్న ప్రగతికి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ముఖ్యంగా అటవీ శాఖ పనితీరు పీపుల్స్ ఫ్రెండ్లీగా మరింతగా మారాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇక జూనియర్ ఐఏఎస్‌లకు హ్యాండ్ హోల్డింగ్ ఇచ్చేలా సీనియర్లు సహకరించాలని దిశా నిర్దేశం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో 6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున వివిధ అంశాలపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ఏఐ సాయంతో వైద్య పరీక్షలు నిర్వహించే వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావటం అభినందనీయం. తక్కువ వ్యయంతో పోర్టబుల్‌గా ఉండేలా మెడ్ టెక్ టూల్స్ తయారు చేయాలి. ఆర్టీఐహెచ్ ద్వారా మరిన్ని ఆవిష్కరణల్ని చేసి ప్రజారోగ్యం కోసం వినియోగిద్దాం. రూట్, రోడ్ ఆప్టిమైజేషన్ కూడా చేసుకుని 108 అంబులెన్సులు త్వరితగతిన చేరుకునేలా చూడాలి. మారుమూల ప్రాంతాల్లో ఉండే వ్యక్తులను కూడా అతి తక్కువ టైమ్ లో 108 చేరుకోవాలి. ఈసారి వేసవి ప్రభావం ఎక్కువ ఉంటుందని అంచనాలు ఉన్నాయి. వడగాలుల ప్రభావంపై ముందుగానే ప్రచారం చేపట్టాలి. వేసవిలో ప్రజలు సురక్షితంగా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు నీటి తొట్టెలను పెద్ద ఎత్తున నిర్మించాం... ఆ తొట్టెల్లో నీళ్లు నింపేలా చర్యలు తీసుకోవాలి. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుంచి పశు భీమా పథకాన్ని కూడా సమర్ధంగా అమలు చేయాలి. ఎండలో పని చేసే ఉపాధి హామీ కూలీలకు సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాలి. వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు"అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**అభివృద్ధికి అటవీ శాఖ ఆటంకంగా మారకూడదు :** "అభివృద్ధికి, మౌలిక సదుపాయల కల్పనకు అటవీ శాఖ సహకరించాలి. నాలుగోసారి సీఎంగా చేస్తున్నాను.. కానీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి అటవీ శాఖ విషయంలో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ఇప్పటికే డిప్యూటీ సీఎంతో మాట్లాడాను... మళ్లీ మరోసారి మాట్లడతాను. పోలీసు డిపార్ట్మెంట్ పీపుల్ ఫ్రెండ్లీగా మారిపోయింది... కానీ ఫారెస్టు డిపార్టుమెంట్ పీపుల్ ఫ్రెండ్లీగా లేరు. మారాల్సిన అవసరం ఉంది. అటవీ శాఖ గ్రీన్ కవర్ పెంచే అంశంపై దృష్టి పెట్టాలి. బయోడైవర్సిటీకి వెళ్లాలి. ప్రజలు ఆహ్లాదంగా పర్యటించేందుకు ఉపయుక్తంగా పరిస్థితులు మారాలి. ఫారెస్టు అధికారులు జిల్లా కలెక్టర్ కిందే పనిచేయాలని గుర్తుంచుకోవాలి. కలెక్టర్లు చెబుతున్నా... అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనలకు అనుగుణంగానే పర్యావరణహిత ప్రాజెక్టులకు సహకరించాలి. సర్వే చేస్తున్న సమయంలో ప్రైవేటు, అటవీ, ఎండోమెంట్ తదితర క్లాసిఫికేషన్ల ప్రకారం రిజర్వు ల్యాండ్ గుర్తించాలి. కొందరు అటవీ శాఖ అధికారుల ఇంప్రాక్టికల్ థింకింగ్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ఎలా..? నడకదారిన శ్రీశైలం వస్తున్న భక్తులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు.. ఆ తర్వాత రోజే తొక్కిసలాట అయ్యే పరిస్థితి వచ్చింది. బద్వేలులోనూ అటవీ శాఖ ఇదే తరహాలో వ్యవహరించింది. ఏమైనా ఇబ్బందులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి. ప్రజలను ఇబ్బంది పెట్టేలా... కార్యక్రమాలకు ఆటంకం కలిగేలా వ్యవహరించకూడదు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా వినూత్న ఆలోచనలు చేయాలి. స్టార్టప్ కంపెనీలు, యువతలో ఉన్న ఇన్నోవేషన్లను ప్రోత్సహించేందుకు ఆర్టీఐహెచ్(రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్) అధికారులు పని చేయాలి. ఆర్టీఐహెచ్‌ను మరింత యాక్టీవ్ చేయాల్సిన అవసరం ఉంది. వినూత్నంగా ఆలోచిస్తారు కాబట్టే... =u×ఎకు యువ అధికారులను నియమించాం. యువ అధికారులకు సీనియర్లు సహకరించాలి.. వారికి హ్యాండ్ హోల్డింగ్ అందించాలి "అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## శనగ పంటకు గిట్టుబాటు ధర కోసం బీజేపీ వినతి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** : గుంటూరు జిల్లాలో శనగ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ బీజేపీ నాయకులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తులిమిల్లి శ్రీనివాసరావు గురువారం జాయింట్ కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు.

అధికారిక గణాంకాల ప్రకారం గుంటూరు జిల్లాలో ఈ సంవత్సరం సుమారు 18,002 హెక్టార్లలో (44,484 ఎకరాలు) శనగ పంట సాగు చేయబడిందని తెలిపారు. ఈ పంటను జిల్లాలో 20,615 మంది రైతులు సాగు చేశారని పేర్కొన్నారు. ఎకరానికి సగటున 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావడంతో జిల్లాలో సుమారు 53 వేల టన్నులు (5,30,000 క్వింటాళ్లు) శనగ ఉత్పత్తి అయినట్లు వై.వి. సుబ్బారావు వివరించారు. కేంద్ర ప్రభుత్వం శనగకు క్వింటాల్‌కు ?5,875 కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ ప్రస్తుతం మార్కెట్‌లో రైతులకు ?4,500 నుంచి ?4,800 మాత్రమే ధర లభిస్తోందని తెలిపారు. దీంతో ప్రతి క్వింటాల్‌కు రైతులు ?900 నుంచి ?1,100 వంకు నష్టపోతున్నారని చెప్పారు. ఈ లెక్కల ప్రకారం గుంటూరు జిల్లాలో శనగ రైతులకు సుమారు ?50 కోట్లకు పైగా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించినప్పటికీ జిల్లాలో తగిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల రైతులు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తెలిపారు. కాబట్టి తక్షణమే జిల్లాలో శనగ పంటకు కనీస మద్దతు ధర ప్రకారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, బీజేపీ పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మంచికలపూడి గంగాధర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు టీ. రామారావు, బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కాంద్రు భాను కిశోర్, కార్యదర్శులు జూటూరి మురళీకృష్ణ, బొమ్ము శంకర్ రెడ్డి, తోట సాంబశివరావు, తోటకూర కోటేశ్వరరావు, ఆళ్ల దాసు, బిళ్ళల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నందికొట్కూరులో విస్తృతంగా ఆప్టా సభ్యత్వ నమోదు కార్యక్రమం



**నందికొట్కూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) సభ్యత్వ నమోదు కార్యక్రమం నందికొట్కూరు మండలంలో విస్తృతంగా నిర్వహించారు. ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు నాయకత్వంలో ఈ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆప్టా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రఫీ, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహబూబ్ భాష, కర్నూలు జిల్లా నాయకుడు నాగార్జున పాల్గొన్నారు. మండలంలోని బ్రాహ్మణకోట్కూర్, వడ్డెమాను, అల్లూరు, మల్యాల, నందికొట్కూరు, బొల్లవరం, దామగట్ల తదితర గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సమావేశమై సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్‌తో జరిగే సమావేశంలో పాల్గొంటానని, ఉపాధ్యాయులు తమ సమస్యలను తన ఫోన్ నంబర్ 9849229829కు తెలియజేస్తే వాటిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం ఆప్టానేనని జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ రఫీ పేర్కొన్నారు.

## అరణ్ములలో బీజేపీ ఆందోళన.. మంత్రి వీణ జార్జ్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత





- బీజేపీ శ్రేణులతో కలిసి మంత్రి కార్యాలయం ముందు నిరసనకు దిగిన జయప్రకాశ్ నారాయణ

**నేషనల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్) :** రానున్న కేరళం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అరణ్ముల నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అరణ్ముల బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన వల్లూరు జయప్రకాశ్ నారాయణ వరుస కార్యక్రమాలతో సీపీఐ(ఎం)కు సవాల్ విసురుతున్నారు. అరణ్ముల ఎమ్మెల్యే, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణ జార్జ్‌పై వైఫల్యాలు, అవినీతి ఆరోపణలు చేస్తూ ఆయన ఇటీవల ప్రజా చార్జ్‌షీట్ విడుదల చేసి సంచలనం సృష్టించారు.

తాజాగా గురువారం ఏకంగా మంత్రి వీణ జార్జ్ కార్యాలయం ఎదుట బీజేపీ శ్రేణులతో కలిసి జయప్రకాశ్ నారాయణ నిరసన చేపట్టడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

మంత్రి అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయం ఎదుట బైఠాయించారు. పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయగా స్వల్ప తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మంత్రి కార్యాలయం వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను పెంచారు. అరణ్ముల నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్ పార్టీలకు సవాల్ విసురుతూ బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలు ప్రస్తుతం ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. ఈసారి అరణ్ములలో బీజేపీ విజయం సాధించాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ కార్యక్రమంలో అరణ్ముల నియోజకవర్గ కన్వీనర్ షాజీరాఘవన్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు విక్టర్ టీ థామస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. సోమన్, బీజేపీ జనరల్ సెక్రటరీ రితీష్ ముండపల్లి, అరణ్ముల మండల అధ్యక్షురాలు దీప, పతనంతిట్ట మండల అధ్యక్షుడు విప్పిన్ వాసుదేవ్, రోయి మ్యాథ్యూ, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బిందు శివాజీ, జిల్లా ఉపాధ్యక్షులు పి.ఆర్. షాజి, బిందు ప్రకాష్, బిందు ప్రసాద్, విజయ్, వి.వి. ప్రసాద్, సన్నీ, జాను, అనిల్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి రాకుండా కేంద్రానికి లేఖలు రాస్తే ప్రయోజనం ఏమిటి?

- రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడటానికి కారణం జగన్ ప్రభుత్వమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** గత వైసీపీ సర్కార్ లో అంకెలగారడీ తో జగన్ మోహనరెడ్డి చేసిన ఆర్థిక విధ్వంసానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తిగా అతలాకుతలం అయ్యిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్ ఆరోపించారు.

గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధానాలు, అప్రజాస్వామిక నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయని అన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం పూర్తిగా దెబ్బతిన్నదని, అప్పుల భారంతో రాష్ట్రాన్ని కుదేలయ్యే పరిస్థితికి తీసుకెళ్లారని ఆయన విమర్శించారు.

రాష్ట్ర ప్రజలకు సంబంధించిన కీలక సమస్యలను చర్చించాల్సిన అత్యున్నత వేదిక అసెంబ్లీ అని, అలాంటి సమయంలో అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రెస్ మీట్లు పెట్టడం ద్వారా విమర్శలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానపరచడమేనని పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా, వైసీపీ అధ్యక్షునిగా మరియు ఎమ్మెల్యేగా జగన్ అసెంబ్లీలో పాల్గొని ప్రజా సమస్యలను లో లేవనెత్తాల్సిన బాధ్యత ఉందని మాధవ్ స్పష్టం చేశారు. అసెంబ్లీని వేదికగా ఉపయోగించకుండా కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయడం ద్వారా రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నించడం సరైంది కాదని ఆయన వ్యాఖ్యానించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొనడం వాస్తవాలకు విరుద్ధమని మాధవ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో సరైన మద్దతు లేక నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న 81 మంది అన్నదాతల కుటుంబాలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పరిహారం అందించి వారి పట్ల బాధ్యతను చాటిందని గుర్తు చేశారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

అదేవిధంగా వైసీపీ పాలనలో సుమారు 11 లక్షల పింఛన్లు తొలగించబడటం ద్వారా వృద్ధులు, వికలాంగులు మరియు నిరుపేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన విమర్శించారు. మహిళల భద్రత విషయంలో కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆ కాలంలో రోజుకు సగటున నలుగురు బాలికలపై అఘాయిత్యాలు జరిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో తిరుమల శ్రీవారి పరకామణి వ్యవహారంలో జరిగిన అక్రమాలపై కూడా ఆయన స్పందించారు. అలాగే వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలోని పలు హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ, ఆ సంఘటనలు ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోగల , ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తూ అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని పీవీయన్ మాధవ్ తెలిపారు. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మరియు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మాధవ్ స్పష్టం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467